ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
డిసెంబరు 18, 2016

చలి మంచుల్లో...

KSR02B149
ENTERED



'షోలే' బైక్



బాబీ బైక్

బాలీవుడ్ బళ్లు

కొత్త సినిమా రిలీజైతే చాలు అభిమాన తారల హెయిర్ స్టైల్, డ్రస్ సెన్స్, ఇలా ప్రతి విషయాన్నీ ఫాలో అవుతూ తమ అభిమాన్ని చాటేస్తుంటారు ఫాన్స్. ఈ అభిమానం సినిమాల్లో తారలు ఉపయోగించే ఖరీదైన కార్లు, బైక్‌లని సైతం సొంతంచేసుకునేంతలా పాకేసింది. 1973లో డింపుల్ కపాడియా, రిషికపూర్ జంటగా వచ్చిన రొమాంటిక్ హిట్ చిత్రం 'బాబీ'లో ఎన్నో సన్నివేశాల్లో కనిపించే బైక్ 'రాజ్ దూత్ జిటిఎస్' 'బాబీ బైక్'గా గుర్తుండి పోయింది. 'షోలే' సినిమాలో 'ఏ దోస్తీ హమ్ నహీ ఛోడేంగే' పాట గుర్తుండని వారుండరు. ఈ పాటలో ఉపయోగించిన '1942 బిఎస్ఎ డబ్ల్యు ఎమ్'... సైడ్ కార్‌ని కలిగుండే ఈ మోడల్ బైక్ 'షోలే బైక్'గా ఎక్కువ మందికి గుర్తుండిపోయింది..1972లో విడుదలైన 'మేరే జీవన్ సాథీ' చిత్రంలో 'మేరే సప్‌నోంకి రాణి కబ్ ఆయేగీతూ' పాట గుర్తుంది కాదా... రాజేష్ ఖన్నా కార్‌లో హీరోయిన్‌ని ఫాలో అయిన ఆ 'ఫ్లాట్ స్పైడర్ కార్' ఎంతో మందిని ఆకట్టుకుంది. నాటి అమితాబ్ 'షోలే', 'దీవార్' చిత్రాల నుండి జాన్ అబ్రహం నటించిన 'ధూమ్' వరకు వివిధ సన్నివేశాలు, ఫైట్‌లు, డ్యూయట్స్‌లో ఉపయోగించిన కార్లు, బైక్‌లని నేటి తరానికి పరిచయం చేసేందుకు ఫిబ్రవరిలో నోయిడాలో ఒక ప్రదర్శనను నిర్వహించనుంది ఆటో ఎక్స్ పో.

'ధూమ్' బైక్

దివార్ వ్యాన్

ENTERED
KSR02B149

నిండు ప్రాణం నిలిపి...

సూది భయమో.. మొత్తం రక్తం పోతుందనే భయమో.. అ ఎవరో ఒకరు ఇస్తార్లే అనే నిర్లక్ష్యమో? తెలీదు కానీ రక్తదానం చేసేవారు లేక విలువైన ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి. అలాంటి వారిలో భయాన్ని పోగొట్టి రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తే.. ఓ నిండు ప్రాణం నిలుస్తుంది. ఓ కుటుంబం రోడ్డున పడకుండా ఉంటుంది. ఇదే ఉజ్వల్‌ని ఓ గొప్ప కారణానికి అంకితమయ్యేలా చేసింది. రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ప్రచారం చేస్తూ 'రక్త్ అర్పన్' సంస్థ ద్వారా వేలాదిమందిని బతికించే ప్రయత్నం చేస్తున్నాడు ఇండోర్‌కి చెందిన ఈ కుర్రాడు.

యాక్సిడెంట్ అవడంతో జీవితంతో పోరాడుతున్న తొమ్మిదేళ్ల చిన్నారి, శస్త్ర చికిత్స నుంచి కోలుకుంటున్న పూణేకి చెందిన 25 ఏళ్ల అమ్మాయి, తీవ్రమైన వ్యాధితో పోరాడుతున్న సూరత్‌కి చెందిన వృద్ధుడు ఇలా వివిధ వయస్సులకి చెందిన వారి పేర్లు, ఊర్లు వేరైనా వారందరి ప్రాణాల్ని సమస్యలో పడేసింది రక్తదాతల కొరత. రక్తం ఇవ్వాలంటే అనేక భయాలుంటాయి. అలాంటి భయం ఉజ్వల్‌కు కూడా ఉండేది. చాలా కాలం రక్తదానానికి దూరంగా ఉన్నా తన జీవితంలో చోటు చేసుకున్న ఒక సంఘటన తనని మార్చివేసింది. 2006లో కామెర్లు సోకిన ఓ చిన్నారికి ఓ-నెగటివ్ గ్రూప్ రక్తం అత్యవసరమని తన మిత్రుడి ద్వారా తెలుసుకున్నాడు ఉజ్వల్. అతి అరుదుగా దొరికే రక్త వర్గం కావడంతో ఆ చిన్నారి తల్లిదండ్రులు అప్పటికే దాతల కోసం ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. ఉజ్వల్‌ది అదే బ్లడ్ గ్రూప్ కావడంతో మిత్రుడి ప్రోద్బలంతో ఆస్పత్రికి చేరుకున్నా మునుపెన్నడూ రక్తం ఇవ్వని కారణంగా రక్తదానం ప్రమాదకరంగా అనిపించింది. ఉజ్వల్ ఒక్కడే కాదు భారత్‌లో చాలామంది ఇలాంటి అపోహలతోనే జీవిస్తున్నారు. ఉజ్వల్ మిత్రుడు ఎంతగా నచ్చచెప్పినా ఆ క్షణంలో భయంతో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయాడు. ఇలా మిత్రుడు తనకి నచ్చచెప్పటాన్ని గమనించిన ఓ వృద్ధుడు ఉజ్వల్ కాళ్లు పట్టుకుని తన మనవరాలిని కాపాడమని కోరాడు. దు:ఖంతో కంట నీరు పెట్టుకున్న ఆ పెద్దాయన నిస్సహాయత తనని కదిలించింది. భయాన్ని పక్కన పెట్టి రక్తదానానికి ముందుకొచ్చాడు. తర్వాత రోజు తన మిత్రులతో ఈ సంఘటన గురించి చెప్పాడు. వాళ్లు ఇదే విధంగా స్పందించడంతోపాటు ఎప్పుడు ఎవరికి రక్తం అవసరమైనా తమ రక్తాన్ని అందించాలని నిర్ణయించుకున్నారు. ఇలా కొంతమందితో ఒక బృందాన్ని ఏర్పరిచాడు ఉజ్వల్. వారిలో ఎవరికి ఎలాంటి సమాచారం తెలిసినా దాన్ని వెంటనే మిగిలిన వారికి తెలియపరుస్తారు. 15 రోజుల్లోనే ఆ బృందంలో ప్రతి ఒక్కరూ రక్తాన్ని అందించారు. అప్పుడే ఉజ్వల్‌కి మరో సమస్య ఎదురైంది. రక్తదానం చేసిన వ్యక్తి మూడు నెలల వరకు తిరిగి రక్తాన్ని ఇచ్చేందుకు వీలులేకపోవడంతో ఆర్కుట్ సామాజిక మాధ్యమం ద్వారా ప్రచారం మొదలెట్టారు. రక్తదానంపై అవగాహనా సదస్సులని నిర్వహించి మరింత మందిని రక్తదాతలుగా మారేందుకు ప్రారంభమైన ఆర్కుట్ గ్రూప్ పేరే రక్త్ అర్పన్. తమని రక్తాన్ని అందించాలంటూ వచ్చే అభ్యర్థనలతో పాటు గ్రూప్‌లో వలంటీర్లుగా పనిచేసేందుకు ఎంతోమంది ముందుకు రావడంతో తక్కువ కాలంలోనే రక్త్ అర్పన్ మంచి ప్రజాదరణ పొందగలిగింది. ఆ తర్వాత దాన్ని మిగతా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేయడం మొదలెట్టారు. వివిధ రకాల బ్లడ్ గ్రూప్‌ల కోసం వచ్చే అభ్యర్థనలు, రక్తాన్ని అందించే దాతల సామర్థ్యం తదితర విషయాలను సేకరిస్తూ మరింత పటిష్టంగా మారింది రక్త్ అర్పన్. ఫేస్‌బుక్, వాట్సప్ వంటి సామాజిక మాధ్యమాలు అందుబాటులోకి రావడంతో ఈ సేవలు మరింత వేగవంతమయ్యాయి. రక్తాన్ని అందించే వారి ఫొటోలని ఈ మాధ్యమాల్లో పోస్ట్ చేయడం ద్వారా మరికొందరు రక్తాన్ని అందించేందుకు ముందుకొచ్చేవారు. వారందరితో ఒక వాట్సప్ గ్రూప్‌ని ఏర్పాటు చేశాడు ఉజ్వల్. రక్త్ అర్పన్ సేవలకు ప్రభావితులైన కొందరు తమ ప్రాంత వాసులుతో కలిసి ఒక బృందాన్ని ఏర్పరిచే ఆలోచన చేశారు. భారత్‌లోని ఏ ప్రాంతవాసులైనా రక్తదానం చేసే బృందంగా రక్త్ అర్పన్ వాట్సప్ గ్రూప్‌లో చేరొచ్చు. అయితే వారికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని పంపించి అవి నిజమైనవిగా నిర్ధారించాకే వారికి సభ్యత్వం లభిస్తుంది. అప్పుడు తమ ప్రాంతంతోపాటు వివిధ ప్రాంతాలకు వారి సమాచారాన్ని అందిస్తారు. సాయం కోరేవారి సమాచారాన్నీ పంపుతారు. ఇలా వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే 60 వాట్సప్ గ్రూపులు ఏర్పడ్డాయి. ఒక్కో గ్రూపులో రక్తాన్ని అందించేందుకు 200 మందికిపైనా ఉన్నారు. సంస్థ సభ్యులు సాయం పొందే వారి వద్ద ఒక కప్పు టీ కూడా ఆశించకుండా రక్తదానం చేయాలనే షరతుకు లోబడి పనిచేస్తున్నారు. ఇప్పటికే పదివేల మంది రక్త దాతలున్న రక్త అర్పన్‌లో కొత్త వ్యక్తులను సభ్యులుగా చేర్చుకోవడంతోపాటు మారుమూల గ్రామాల్లో ర్యాలీలు నిర్వహిస్తూ రక్తదానంపై అవగాహనా సదస్సులను నిర్వహిస్తుంటారు. రక్తదానంతో వేలాది మందికి ఊపిరిపోయడంతోపాటు నిర్వాసితులు, ఆర్థికంగా వెనుకబడిన వారికి వైద్య సాయాన్ని కూడా అందిస్తోంది రక్త అర్పన్. మరి కొన్ని సంస్థలు అందించే విరాళాలతో విదేశాల్లోనూ తమ సేవల్ని అందించేందుకు కృషిచేస్తున్నారు ఉజ్వల్.



-శర్వాణి

ఇండెక్స్

విజేత.................3
గోల్ఫ్ క్వీన్

స్టార్........4
నటనే శ్రద్ధాసక్తిగా

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం...........10
సోలార్ పవర్‌కోట్

వినూత్నం.............. 11
పుస్తక ప్రియులకు మాత్రమే

కవిత్వమ్...............14
ఇప్పటి పిల్లలూ...

చలి మంచుల్లో...

అట్టమీది కథ...6

తెలుసా...................15
అందం వెనక...

కథ 16
ఆఖరి ఘడియలు

రుచి......................21
చేపల కుర్మా

బాల నేస్తాలు............23
టాస్మానియన్ డెవిల్

పద వికాసం.....
....24

విశేషం- 12
పిరమిడ్ ప్రపంచం

కాస్ట్రో జీవితం ఉత్కంఠ భరితం

ఫైడల్ కాస్ట్రోపై కవర్ స్టోరీ గొప్ప ఉత్కంఠను కలిగించింది. ఇది వరకు తెలియని అనేక వాస్తవ అంశాలను సంపూర్ణంగా గ్రహించాం. ఐక్యరాజ్యసమితిలో నాలుగున్నర గంటలు, కాంగ్రెస్ సభలో ఏకబిగిన ఏడు గంటలు ఉపన్యసించడం వంటివి నిర్ఘాంతపరిచాయి. భారత మహిళా క్రికెట్ టీమ్‌లో వికెట్ కీపర్‌గా రాణిస్తున్న సుష్మా శర్మ పరిచయం ఆసక్తిని కలిగించింది. ఉత్తమ నటిగా గుర్తింపు కారకుడి గ్లామర్ పాత్రలకు అంగీకారం తెలుపుతున్న పూర్ణ నిర్ణయం అభినందనీయం. యోహాన్నా వింత అలర్జీ, కంటెయినర్ డార్మెటరీలు, నాసాకి కావలసిన స్పేస్ సూట్ జాకెట్లు, విచిత్రంగా కనిపించాయి.

టి. సత్యనారాయణ, విశాఖపట్నం.

ఆకట్టుకున్న కాబూలీవాలా

కాబూలీ వాలా కథ ఆకట్టుకుంది. ఆఫ్ఘనిస్థాన్ నుంచి భారత్‌కు వచ్చి ఇక్కడ స్థిరపడిన వారి చరిత్రను బాగా వివరించారు. కాబూలీవాలాల గురించి తెలుసుగానీ, వారి వెనుక ఇంత చరిత్ర ఉన్నట్టు తెలియదు. మహిళా వికెట్ కీపర్, హిమాచల్ విక్కీ సుష్మా వర్మ మరిన్ని ఉన్నత

శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిద్దాం. కమ్యూనిస్టు విప్లవ జ్యోతి ఫైడల్ కాస్ట్రో జీవిత చరిత్రను కళ్లకు కట్టినట్లు వివరించారు. నిద్రాహారాలు మాని ఆయన సాగించిన పోరు చిరస్మరణీయం.

-వద్ది దుర్గారావు, పోలవరం.

కవర్ బావుంది

స్నేహ సంచికలో కాస్ట్రోపై వచ్చిన కవర్ స్టోరీ, కవర్ పేజి రెండూ చాలా బాగున్నాయి. కాస్ట్రో గురించి మాకు తెలీని విషయాలు ఎన్నో తెలుసుకున్నాము. ఆయన నాయకత్వంలో అతి చిన్న దేశం క్యూబా ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. అమెరికా సామ్రాజ్యవాదంపై తుది శ్వాస వరకు పోరాటం జరిపిన విప్లవ యోధుడు కాస్ట్రో. ప్రపంచ పోలీస్, పెద్దన్న అని పిలువబడే అమెరికాకు ఎదురొడ్డి నిలిచిన వాడు కాస్ట్రో. ఆయన్ని చంపడానికి అమెరికా 638 సార్లు ప్రయోగాలు చేసిందంటే కాస్ట్రో అమెరికాకి ఎలా కొరకరానికొయ్యలా మారాడో మనకు అర్థం అవుతుంది. 'ఒక్క రూపాయి' కథ చాలా బాగుంది.

మార్టూరు అజయ్ కుమార్, చిలకలూరిపేట.

అలనాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నాం

కాబూలీ వాలా కథ ఆకట్టుకుంది. 1949లో నేను హైస్కూల్లో ఎస్.ఎస్.ఎల్.సి చదువుతున్నప్పుడు ఆంగ్ల పాఠ్యపుస్తకంలో రవీంద్రుని కాబూలీవాలా కథలో కాబూలీవాలా గురించి మా ఆంగ్ల అధ్యాపకులు చెప్పిన పాఠం ద్వారా తెలుసుకున్నాం. నా మనస్సులో నాటుకుపోయిన ఆ జ్ఞాపకాలను ఇప్పుడు తిరిగి గుర్తు చేసినందుకు సంతోషం.

క్రై.ప నాగరాజు, అనంతపురం.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4,
ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

విజేత



గోల్ఫ్ క్వీన్

ఒకప్పుడు గోల్ఫ్ ఆట పురుషులకే పరిమితం. అలాంటి ఆటలో ఓ మహిళ ప్రవేశించి చరిత్రనే తిరగ రాసింది. రియో ఒలింపిక్స్‌లో గోల్ఫ్ ఆటలో పాల్గొన్న ఏకైక భారతీయ మహిళ, అతి పిన్న వయస్కురాలు కూడా. ప్రత్యర్థి ఎంతటి బలశాలి అయినా, అగ్రస్థానంలోని ర్యాంకరైనా ఎటువంటి తొణుకూ, బెణుకూ లేకుండా పోరాడటమే ఆమె నైజం. ఒకవైపు ఆటలోనూ, మరోవైపు చదువులోనూ విజయం సాధించి తోటి విద్యార్థులకి రోల్ మోడల్‌గా మారింది బెంగుళూరుకు చెందిన అదితి అశోక్.

బెంగళూరులో 1998 సంవత్సరంలో ఉన్నత కుటుంబంలో జన్మించింది అదితి. పండిట్ గుడ్లమనీ దంపతుల ఏకైక సంతానం. 6 సంవత్సరాలచిరుప్రాయంలోనే పలకా బలపంతోపాటుగా గోల్ఫ్ కర్రను పట్టుకుని నేర్చుకుంది. ద ఫ్రాంక్ యాంటోనీ పబ్లిక్ స్కూల్లో 2002 నుండి 2016 వరకు చదివింది. 9 సంవత్సరాల వయస్సులో మొట్టమొదటగా కర్నాటక గోల్ఫ్ క్లబ్ టోర్నమెంట్‌లో అడుగు పెట్టింది. 2015లో సెయింట్ ఆండ్రూస్‌లో జరిగిన ఇంటర్నేషనల్ యూరోపియన్ ఉమెన్ అమెచ్యూర్ ఛాంపియన్ షిప్ పోటీల్లో రెండో స్థానంలో నిలచి సెయింట్ రూల్ ట్రోఫీని, అండర్–18 పోటీల్లో ది నికొలస్ ట్రోఫీ, డిన్‌విడీ ట్రోఫీని సొంతం చేసుకుంది. 2016 లో జరిగిన రియో సమ్మర్ ఒలింపిక్స్‌లో పాల్గొని తన సత్తాను ప్రపంచానికి చాటింది.

అదితి సాధించిన విజయాలు అంత సులువుగా వచ్చినవి కావు. ఆ విజయం వెనుక ఎంతో కఠోర శ్రమ, కఠోర శిక్షణా, ఆహార నియమాలు, శారీకర దారుఢ్యమే ఆమెను ఆ స్థాయికి చేర్చాయి. మలేషియాకు చెందిన స్టీవెన్ గ్యూలియానో అనే కోచ్ వద్ద బెంగుళూరులో శిక్షణ పొందింది. స్టీవెన్ ఎన్నో మెళకువలతో కఠినమైన శిక్షణను ఇచ్చాడు. అదితి బెంగళూరులోని కె.జి.ఎ(కర్ణాటక గోల్ఫ్ అసోసియేషన్)లో సాధన చేసేది. అంతేగాదు! రియో ఒలింపిక్స్ సమయంలో 12 వతరగతి పబ్లిక్ పరీక్షలు ఒకవైపు పరీక్షలకు సిద్ధమవుతూనే మరోవైపు యూరప్ టూర్ రియో ఒలింపిక్స్ ఒత్తిడిని అధిగమించి ఎంతో మానసిక స్థైర్యంతో ముందుకు సాగింది. రెండింటిలోనూ విజయం సాధించి మిగతా విద్యార్థులకు ఆదర్శంగా మారింది. అదితి జర్నలిజంలో, సైకాలజీలో డిగ్రీ చేయాలనుకుటోంది. ఇంగ్లీష్ అంటే చాలా ఇష్టం.



తండ్రితో అదితి

నాన్న కోరిక

అదితి తండ్రి గుడ్లమనీ 10 సంవత్సరాల వయస్సు నుండే ఒలింపిక్స్‌లో పాల్గొనాలని ఎన్నో కలలు కనేవాడు. తన కలను తన కూతురు ద్వారా సాకారం చేసుకోవాలనుకున్నాడు. ఆమెకు చిన్నతనం నుంచే గోల్ఫ్ ఆట పట్ల ఇష్టాన్ని పెంచాడు. దగ్గరుండి మరీ సాధన చేయించేవాడు. ఆయన కూతురితో ఒక తండ్రిగా కంటే స్నేహితుడిగానే మెలిగేవాడు. ఆమె కూడా ఖాళీ సమయం దొరికితే చాలు తండ్రితోనే గడిపేది. ఆటకు ఎటువంటి అవరోధాలు రాకుండా తల్లిదండ్రులు చూసుకునేవారు. ఆమె నిర్ణయాన్ని ఎప్పుడూ గౌరవించేవారు. అదితి ప్రస్తుతం ప్రపంచానికే ఆదర్శంగా నిలచింది. గోల్ఫ్ ఆట ప్రతిరోజూ ఒక సవాలే. ఎన్నో కొత్త కొత్త విషయాలు నేర్చుకోవాల్సి ఉంటుంది.

మలుపు

ఒలింపిక్స్‌లో గెలవడం అదితి కెరీర్‌నే మలుపు తిప్పింది. ఈ పోటీల్లో ఇండియా తరపున పాల్గొని ప్రపంచంలో మేటి గోల్ఫ్ దిగ్గజాలైన 10 మంది క్రీడాకారులతో తలపడింది. అదితి విజయం గురించి ఆలోచించదు. తనదైన శైలిలో ఆడుతూ ఉంటుంది. అదే తన విజయానికి కారణం. ఈ గెలుపు ఇండియా గెలుపుగానే భావిస్తుంది తప్ప తన గెలుపుగా భావించనంటుంది.

తనకు గుర్తింపు తెచ్చిన గోల్ఫ్ ఆటలో ఎప్పటికైనా ప్రపంచంలోనే నెంబర్ వన్ స్థాయిలో ఉండాలనేదే అదితి కోరిక. వాళ్ల నాన్నే తనకు స్ఫూర్తి. ఆయన కలను ఎప్పటికైనా నెరవేర్చాలని ముందుకు సాగుతోంది అదితి. ప్రస్తుతం ఇండియాలో గోల్ఫ్ ఆటకు మంచి ఆదరణ ఉంది. ఒకప్పుడు కేవలం వృద్ధులే ఆడతారనే నానుడి ఉంది. కానీ నేడు ఆ రోజులు మారాయి. అమ్మాయిలు కూడా ఈ ఆటలో బాగా రాణించగలరని నిరూపించింది అదితి.

2013లో ఆసియా యూత్ గేమ్స్, 2014లో యూత్ ఒలింపిక్ గేమ్స్, ఆసియన్ గేమ్స్‌లోనూ ఆడిన ఏకైక భారతీయ గోల్ఫ్ క్రీడాకారిణి. 2012,13,14 సంవత్సరాల్లో వరుసగా 3సార్లు నేషనల్ జూనియర్ ఛాంపియన్ షిప్‌ని, 2011, 2014లో వరుసగా 2 సార్లు నేషనల్ అమెచ్యూర్ ఛాంపియన్ పోటీల్లో విజయం సాధించింది.

ఫిటినెస్ కోచ్ నికోలస్ అదితి ఆహార నియమాల పట్ల ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటాడు. బ్రేక్‌ఫాస్ట్‌కు గ్లాస్ జ్యూస్, 2 ఎగ్‌లు, ఓట్ మీల్, కొన్నిసార్లు పండ్లరసాలు, పాలు తీసుకుంటుంది. లంచ్‌కు రోటీతో బ్రౌన్ రైస్, టోర్నమెంట్‌లో ఉన్నప్పుడు స్నాక్స్, విత్తనాలు, గ్రీన్‌టీ మాత్రమే తీసుకుంటుంది. డిన్నర్‌కు సూప్.

గోల్ఫ్‌లో మెళకువలు నేర్చుకోడానికి 2010లో విదేశాలకు కూడా వెళ్లింది. రియో ఒలింపిక్స్ ప్రారంభం నుండి ఇప్పటివరకూ 40 వేల కిలోమీటర్లు ప్రయాణం చేసింది. రాబోయే ఇన్నింగ్స్‌లో తన స్థానాన్ని ఇంకా మెరుగుపరుచుకోవాలనే ధ్యేయంతో ముందుకు సాగుతోంది అదితి.

నటనే శ్రద్ధాసక్తిగా...

బెంగాలీ అయినా తెలుగువారికి బాగా పరిచయమైన తార శ్రద్ధా దాస్. బాలీవుడ్ సినిమాల్లోను నటించినా ఆ తర్వాత సొంత ప్రాంతీయ చిత్రసీమలోకి అడుగుపెట్టినా శ్రద్ధకు తెలుగు టచ్ పోలేదు. అవకాశమున్నపుడల్లా పూర్తి స్థాయి పాత్రల్లో నటిస్తూనే ప్రత్యేక గీతాల్లో పలకరిస్తూ కెరీర్‌లో నిలదొక్కుకుంటోంది. ఓ హిందీ చిత్రంలో... మోడలింగ్ రంగంలో నిలదొక్కుకునే ఓ అమ్మాయిగా ఆమె చేసిన పాత్ర నటిగా శ్రద్ధ స్థాయిని ప్రేక్షకుడికి చెబుతుంది.

● శ్రద్ధా దాస్ తల్లిదండ్రులు బెంగాలీలే అయినా ఆమె పుట్టింది ముంబయ్‌లోనే. తండ్రి వ్యాపారవేత్త. తల్లి గృహిణి. వీరు పురులియా నుంచి ముంబయ్ వచ్చి స్థిరపడ్డారు.

● ముంబైలో విద్యాభ్యాసాన్ని పూర్తి చేసింది. ముంబై విశ్వవిద్యాలయం నుంచి పాత్రికేయ రంగంలో డిగ్రీ పొందింది.

● ఆమె నటన విషయంలో తల్లిదండ్రులే తన మొదటి విమర్శకులుగా భావిస్తుంది.

● సాధారణంగా బెంగాలీలకు కళలకు అనుబంధం ఉంటుంది. అది ముంబయ్‌లోను ఆమెను వీడిపోలేదు. చిన్నపుడే ఆట-పాటల్లో మంచి ప్రతిభ కనబరిచేది.

● ఖాళీ సమయాన్ని పాటలు పాడుతూ, లోకల్ ప్రోగ్రామ్‌లను చూస్తూ గడుపుతుంది.

● డిగ్రీ చదువుతున్న రోజుల్లో రంగస్థలంలో పనిచేసింది. ఆ సమయంలో ఎన్‌యస్‌డి సంస్థ నిర్వహించిన రంగస్థల దిగ్గజాలు పియూష్ మిశ్రా, చిత్తరంజన్ గిరి, శలీమ్ సాస్ వర్క్‌షాపులకు హాజరయ్యేది.

● నటనా రంగంలోకి రాక మునుపు ప్రకటనా రంగంలో మోడల్‌గా పరిచయమైంది. సుమారు 400 ప్రకటనల్లో నటించింది.

● 2010లో ఇండియా-పాకిస్తాన్ సంబంధాలపై తీసిన 'లాహోర్' చిత్రంతో బాలీవుడ్‌లో నటించే అవకాశం శ్రద్ధకు దక్కింది. దీని షూటింగ్‌కు ఒకటిన్నర సంవత్సరం పట్టింది.

● శ్రద్ధా రెండో హిందీ చిత్రం 'దిల్ తో బచా హైజీ' 2011లో విడుదలైంది. ఆ చిత్రంలో అజయ్ దేవగన్, ఇమ్రాన్ హష్మీ, ఓమీ వైద్యాతో కలిసి నటించింది. ఈ చిత్రంలోని పాత్ర మోడల్‌గా మారాలనుకునే అమ్మాయిల మనస్తత్వాల చుట్టూ తిరుగుతుంది.

● ఓ పత్రికలో వచ్చిన శ్రద్ధ చిత్రాన్ని చూసి 'ఆర్య-2'లో అవకాశం వచ్చిందట. సినిమాలోని శాంతి పాత్రకు నప్పుతుందని హీరో, దర్శకులు అవకాశమిస్తే అది తెలుగులో కెరీర్ తయారుచేసింది.

● ఆమె నటించిన 'డైరీ' సినిమా థ్రిల్లర్ తరహాలోది. అందులోని పాత్ర... అప్పటి వరకు తనలో ఉన్న పిరికి స్వభావాన్ని పోగొట్టి ధైర్యవంతురాలిగా మార్చివేసిందట. చాలా సున్నిత మనస్కురాలు... అదే తన బలం, బలహీనత అని తరచూ చెబుతుంటుంది.

● ఎక్కువగా సీక్వెల్ చిత్రాల్లో కనిపించే శ్రద్ధాని కొందరు సీక్వెల్ రాణి అని పిలుస్తుంటారు.

● 'సిద్ధూ ఫ్రం శ్రీకాకుళం' తర్వాత సినిమాకీ సినిమాకీ 6 నెలల విరామం తీసుకుంటూ వరుసగా 5 సినిమాలలో నటించింది.

● 'టార్గెట్' సినిమాకు ముందు 68 కేజీలున్న శ్రద్ధా తర్వాత 50 కేజీలకు తగ్గింది. ఆ సమయంలో వేడినీళ్ళు, గ్రీన్ టీ, రాత్రిపూట ఎగ్, సోయా పన్నీర్ మాత్రమే తీసుకునేది.

● పాత్ర కోసం బాక్సింగ్, కత్తిసాము, కరాటే వంటి యుద్ధ విద్యలు కూడా నేర్చుకుంది.

● ఇప్పటి వరకు తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ, బెంగాలీ చిత్రాలలో నటించింది.

● తెలుగు చిత్రాల్లో మంచి పేరు తెచ్చుకున్న శ్రద్ధ తన అభిమానాన్నీ పంచుకుంది. తన మొదటి ఇల్లు హైదరాబాద్, రెండో ఇల్లు ముంబయ్ అని చెప్తుంటుంది.

● చిన్నతనం నుంచి సుస్మితాసేన్ ప్రేరణ. సుస్మిత 'మిస్ యూనివర్స్' అయినపుడు ఆ ప్రభావం శ్రద్ధాపై పడింది.

● మాతృ భాష బెంగాలీతోపాటు హిందీ, ఇంగ్లీషు భాషలు తెలుసు. తెలుగు నేర్చుకుంటోంది. రొమాంటిక్, కామెడీ, హారర్ సినిమాలంటే ఇష్టం.

● శ్రద్ధాకు ఈత కొట్టడమంటే సరదా.

● 2015లో రెండు ద్విభాషా హారర్ చిత్రాలైన లిపి ఫలకం(తెలుగు, కన్నడ), 'హాంటింగ్ ఆఫ్ బాంబే మిల్స్' (తెలుగు, హిందీ)లలో నటించింది.

● సిద్ధు ఫ్రం శ్రీకాకుళం'తో టాలీవుడ్ అవకాశాలు దక్కించుకున్న శ్రద్ధ.. 1820 లవ్ స్టోరీ(2008), డైరీ, అధినేత, మరో చరిత్ర, డార్లింగ్, నాగవల్లి (2010), ముగ్గురు, మొగుడు (2011), రే, బందిపోటు, ఆట (2015). గుంటూర్ టాకీస్ (2016) మరికొన్ని తెలుగు చిత్రాల్లో నటించింది.

●2014లో 'ద రాయల్ బెంగాల్ టైగర్' సినిమాతో బెంగాలీ రంగుల ప్రపంచంలోకి అడుగు పెట్టింది.

●శ్రద్ధా 'రే' చిత్రంలో అమెరికన్ పాప్ గాయనిగా హీరోతో సమానమైన పాత్రను పోషించి విమర్శకుల మన్ననలు పొందింది.

✦

నవ్వుల్ - పువ్వుల్



రాత్రిపూట వాయిస్తా...

కొడుకు: నాన్నా...నాన్నా... నాకు సన్నాయి నేర్చుకోవాలనుంది. కొనిపెట్టవా?

తండ్రి: వేళాపాళా లేకుండా వాయిస్తే ఇంట్లో గోలగా ఉంటుంది రా....

కొడుకు: పర్లేదు నాన్నా.. మీరంతా నిద్రపోయిన తర్వాత వాయించుకుంటాను..

చెక్కు బౌన్స్



డాక్టర్: రావయ్యా చంద్రం.. ఇప్పుడే నీ గురించే చెప్పారు మా వాళ్ళు

చంద్రం: ఎందుకండీ?

డాక్టర్: ఫీజు కింద నువ్వు ఇచ్చిన చెక్కు బౌన్స్ అయిందట

చంద్రం: మీరు నయం చేసిన జబ్బు కూడా తిరిగి వచ్చింది..

బతికించారు....

మ్యూజియం ఉద్యోగి: అయ్యయ్యో ...ఇప్పుడు మీరు పగలకొట్టిన గ్లాసు ఐదు వేల సంవత్సరాల నాటిది.. !

పాపారావు: హమ్మయ్య... బతికించారు ఇంకా కొత్తదేమోనని భయపడి చచ్చాను.

నాకు నచ్చిన కార్టూన్

అభిజిత్ , విజయవాడ

పట్టుదల...

నరసింహం: పట్టుదల ఉంటే మనిషి సాధించలేనిది లేదోయ్...

కుర్రాడు: అలాగా.. అయితే ఈ గ్లాసులో పాలు కింద పోస్తాను. పట్టుదలతో తిరిగి గ్లాసులో నింపండి చూద్దాం.

సగం పాసైనట్టే

శ్రీపతి: అదేంట్రా.. రెండూ ఒకే రకం పుస్తకాలెందుకు కొన్నావు?

గిరి: ఈ పుస్తకం చేతిలో ఉంటే సగం పరీక్షలు పాసైనట్లే అని రాసుంది. అందుకే రెండు కొన్నాను.

దొండకాయ దొంగ...

వనజ: ఈ రోజు మీ ఇంట్లో దొండకాయ కూర కదూ వదినా?....

జానకి: అరె! అంత కరెక్టుగా ఎలా చెప్పగలిగారు?....

వనజ: రాత్రి మా దొడ్లో దొండకాయలు ఎవరో కోసుకెళ్లార్లే...

కిసుక్కు సిత్రం



బాక్సింగ్ వస్తే రండి డూడ్

చలి మంచుల్లో...

చలికాలంలో నగరం చలి కాచుకుంటుంది కెనడాలో. పరవళ్లు తొక్కే ఓ జీవ నది గడ్డకట్టుకుపోతుంది యూరప్‌లో. ఎడారి, వేడి తప్ప వర్షం చుక్క తడపని సహారాలో మంచు కురుస్తుంది. చలి వణుకుడికి భాషే మారిపోయి గమ్మత్తైన పేర్లు పెట్టుకుంటుంది గ్రీన్‌ల్యాండ్‌లోని ఆవాసం. ఇలా శీతాకాలపు చిత్రాలెన్నో ఉన్నాయి మనిషి కట్టుకున్న పట్టణాల్లో, చదును చేసుకున్న ఆవాసాల్లో. చలి మంచుల్లో... ఇవెలా తడిసి ముద్దవుతుంటాయనే విషయాలే ఈ వారం అట్టమీది కథలో మీ కోసం.

-అజయ్ కుమార్ వారాల
9502395077

లంబసింగికి రెండో ఉదక మండలంగా, దక్షిణాది కాశ్మీరంగా గుర్తింపు రావడంతో తెలుగోళ్లకు ఓ ఐస్ బాక్స్ దొరికినట్లయింది. బాగా చలిగా వున్న ప్రాంతాల్ని ఇలా పిలుచుకోవడం శీతల దేశాల్లో సాధారణం. సున్నాను తాకేస్తాయా అని బెట్‌లు వేసుకుంటున్న మన దక్షిణాది చలి చోట్ల ముచ్చట్లు, కాశ్మీర్ నుంచి హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వరకు విశేషాలు ఎన్నింటినో మనం విన్నాం. కాశ్మీర్ షాల్స్, ఊటీ తేనీరు గురించి బానే తెలుసుకుని ఉండొచ్చు కానీ ఓసారి భూమంతా చలికాలంలో చుట్టేద్దాం. అంతా తిరగలేం కానీ కొన్ని దేశాలు, నగరాలు, ఊళ్లు ఇలా కొన్ని చలి ప్రదేశాల్లోని పరిస్థితి కాస్త తెలుసుకుందాం. ఇగ్లూల్లో తలదాచుకునే ఆర్కిటిక్ వాసులు, రెయిన్‌డీర్లను పెంచుకునే సైబీరియన్ల తెగల గురించి, ఆదిమ సంస్కృతుల గురించి చాలా విని ఉంటాం కానీ, అసలు చలికాలంతో కొత్త మనిషి చెలిమి గురించి కాసేపు చదువుకుందాం.

చలికాలం గురించి శీతల ప్రాంతపు ఓ కవి ఇలా అంటాడు.. "శీతాకాలమంటే... 'ఏంటి నీ సంగతి' అని మనిషిని ప్రకృతి హెచ్చరించి చెప్పే ఓ తీర"ని. అవును మనమంటే ఎండాకాలం మండే ప్రాంతపు మనుషులం.. మనకు చలికాలం వచ్చిందంటే 'గీతాంజలి' సినిమాలా అనిపిస్తుంది. కానీ చలి దేశపు వాసులకు శీతాకాలం తలుపు కొట్టిందంటే అంతే. 'ద డే ది ఎర్త్ స్టుడ్ స్టిల్' (భూమి స్తంభించిన రోజు) హాలీవుడ్ చిత్రంలోని ఓ సన్నివేశంలా జీవనం గడ్డకట్టుకుపోతుంది. అయినా ఇక్కడ తుఫాన్ వాతావరణానికి సాయంత్రానికే అందరూ గజగజలాడిపోతున్నారు. తెల్లారి లేచి పాల ప్యాకెట్ తెచ్చుకునేందుకు షాపుకు వెళ్లి 'పాఆ...ల..ఆ ప్యా...కెట్' అని గజగజ వణికిపోతూ అడుగుతున్నారు కదా. మరి ఈ ఎఫెక్ట్ చలి తీవ్రంగా ఉండే ప్రాంతాలవారి భాషను, పదాలను, పేర్లను అన్నింటనీ వణికిస్తుందేమో.

పెదాలదురుతూ మాట్లాడితే ఎలా ఉంటుందో ఆర్కిటిక్‌వాసుల భాష, యాస అలా ఉంటుంది. పేరుకే పచ్చగా కనిపించే గ్రీన్ ల్యాండ్ ఎక్కువగా మంచుతో కూరుకుపోయిన ప్రాంతం. అక్కడ మానవ ఆవాసాల పేర్లన్ని చిత్రంగా ఉంటాయి. అంత బారెడు ఇంగ్లిష్ అక్షరాలుంటాయి. మనకు నోరు తిరగనంత మెలికలు మెలికలుగా ఉంటాయి. 'అంగ్మాగ్సాలిక్' (సరిగ్గా రాశామో లేదో) అందులో ఒకటి. అందుకే దాన్ని తాసీలాక్‌గా పేరు మార్చారు. ఇది కూడా కాస్త వణుకుతున్నట్టే ఉంది. అక్కడి జనాభా 2017 మందే. కానీ అదో పెద్ద సిటీ లెక్క. గ్రీన్‌లాండ్ రాజధాని నూక్‌లో 16 వేల మందే ఉంటారు. అక్కడ వెయ్యి జనాభా దాటినవి కేవలం 13 నగరాలే ఉంటాయి. మిగతావన్నీ ఆలోపే. అందుకే అంత పెద్ద ప్రాంతంలో 56 వేలకు పైగా జనాభా ఉంటుంది. అన్నింటి కన్నా తక్కువగా ఇగాలికు అనే గ్రామంలో 27 మంది ఉంటారు. అక్కడ అత్యధిక ఉష్ణోగ్రతలు 7 డిగ్రీలకు మించవు. అంటే మన లెక్కలో ఏడాదంతా చలికాలమేనన్న మాట. దగ్గరలోని యూరోపియన్ దేశం ఐస్‌ల్యాండ్ పేరుకు తగ్గట్టే ఉంటుంది. సూర్యకిరణాలు నేలను తాకవేమో అనిపిస్తుంది. అందుకే ఇక్కడి సగటు ఉష్ణోగ్రతలు సున్నాకు కిందే ఉంటాయి. గడ్డ కట్టిన జలపాతాలు, మైదానాల్లో మంచు పోగై శిఖరాల్లా కనిపించే గుట్టలు అంతా విచిత్ర లోకంగా అనిపిస్తుంది. అయితే ఇక్కడ సైతం మనిషి మనుగడ సాగించేస్తున్నాడు.

స్కేట్ బోర్డే సైకిల్

బాగా సంపద ఉన్న కుటుంబంలో ఓ బిడ్డ జన్మిస్తే వాణ్ని సిల్వర్ స్పూన్‌తో పుట్టాడని అంటారు కదా.. అలా కెనడాలో సరదాగా ఓ మాట చెప్పుకుంటారు. కెనడాలో పిల్లలు పాదాలకు స్కేట్ బోర్డులు తగిలించుకుని పుడతారని పరాచికాలాడతారు. లేకుంటే ఇంత బుడ్డోడు అంత బుడ్డది ఎవరిని చూసినా గడ్డకట్టిన రోడ్లపై ఐస్ స్కేట్‌లేసుకుని రయ్యిన దూసుకుపోతుంటారు. పిల్లలే కాదు పెద్దలు కూడా మరీ చలి రోజుల్లో చిన్న చిన్న పనులకు సైకిల్‌లా వీటిని వాడేస్తారు. మంచు వల్ల రోడ్లు జారిపోతుంటాయి. అందుకే కార్లు, బైక్‌లు ఇతర వాహనాల కంటే ఇవే ఎక్కువ ఉపయోగం. రెండేళ్ల బుడతడు, వందేళ్లు దాటిన వృద్ధులని తేడా లేకుండా అందరూ గడ్డకట్టిన సరస్సు మీదో రోడ్డు మీదో సునాయాసంగా ఐస్ స్కేట్ చేస్తుంటారు. హంసల్లా హుందాగా కదలడం వచ్చు.. రాకెట్‌లలా సర్రున చేరడం తెలుసు. ఇక ఐస్ హాకీ గురించి ప్రత్యేకంగా ఏం చెప్పాలి. అది కెనడా డి.ఎన్. డి.ఎ.లో ప్రింటయిపోయిందని గర్వపడుతుంటారు. ఈ చలికాలపు ముచ్చటను అతి వేడి ప్రాంతం దుబాయ్‌లోను తీర్చుకుంటున్నారు. కృత్రిమంగా ఐస్ స్కేటింగ్ రింక్‌లను ఏర్పాటు చేసుకుని స్కేట్ బూట్‌లు వేసుకుని ఓ ట్రయల్ వేస్తున్నారు. జారిపడినా 'అబ్బే పర్లేదులే...' అంటూ మరో చాన్స్

తీసుకుంటున్నారు. విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు కూడా మంచు ముచ్చట్లు వచ్చేస్తున్నాయి. ఇక్కడ పెట్టే ఎగ్జిబిషన్లలో కృత్రిమంగా మంచు కురిపించే సెట్లు వేసి కాసింత చల్లదనాన్ని అందిస్తున్నారు.

కెనడాతో పాటు చాలా చలి దేశాల్లో ఫ్రైరీ వింటర్ అని ఓ కార్యక్రమం ఇరుగు-పొరుగు అంతా జరుపుకుంటారు. అందరూ ఓ రోజనుకుని తలావొక చేయి వేసి రోడ్డున పరుచుకున్న మంచును తొలగిస్తారు. మంచులో కూరుకుపోయిన కార్లను బయటకు తీస్తారు. ఇళ్ల పైకప్పులు, కిటికీలపై పేరుకున్న మంచును దులుపుతారు. ఇదంతా వేడుకలా సాగుతుంది. అలా పండగలా చేసుకోకపోతే ఆడుతూ పాడుతూ పని చేయకపోతే మంచు కష్టాలు తీరవు. అందుకే ఫ్రైరీ వింటర్. అలా పనిచేస్తున్నప్పుడే పక్కనోడి మీద మంచు ముద్ద విసరాలనే చిలిపి కోరిక పుడుతుంది. ఒకళ్లనొకళ్లు మంచు ముద్దలతో కొట్టుకుంటారు. ఓ పదిమంది పిడుగ్గాయలకు పోటీగా నలుగురు పెద్దల్లోని పిల్ల మనసులు ఐస్‌మేన్‌ను తయారుచేసుకుంటారు. క్యారెట్ పర్‌ఫెక్ట్‌గా ముక్కులా పెట్టేస్తారు. ఇలా తయారు చేసుకున్న మంచు మనిషి కరిగిపోతే ఇక చలి కాలం చివరకొచ్చిందని అర్థమవుతుంది. ఎందుకంటే చలికాలంలో చుట్టూ ఉన్న ప్రకృతే కాదు కాలం కూడా స్తంభించినట్టుగా అనిపిస్తుంది. ఐదారు నెలల పాటు ఉండే చలికాలం నుంచి నగరాలకు నగరాల్నే వెచ్చగా ఉంచేందుకు అత్యాధునిక సాంకేతికతను వాడుతుంటారు. మనకిక్కడ ఏసీలున్నట్టే అక్కడ వారికి థర్మోస్టాట్‌లుంటాయి.



భాష, సంస్కృతిపై ప్రభావం

వాతావరణ ప్రభావం మన భాష, సంస్కృతిపైనా వుంటుంది. ఎలాగంటారా? ఉష్ణ దేశాల్లో వేడిమిని తట్టుకోలేక చల్లటి వాటిని ఇష్టపడతారు. ఎండన పడి వచ్చిన వారికి చల్లగా మంచినీళ్లో, మజ్జిగో ఇస్తారు. పిల్లా పాపలతో 'చల్ల'గా వుండమంటూ దీవిస్తారు. మజ్జిగను కూడా కొన్ని చోట్ల 'చల్ల' అని పిలుస్తారు. అందుకే ఇంటికొచ్చిన వారిని 'చల్ల పుచ్చుకుంటారా?!' అని అడుగుతుంటారు. ఇక శీతల దేశాల వారు చలిని తట్టుకోలేక వేడిమిని కోరుకుంటారు. అందుకే 'వామ్ వెల్‌కమ్' అంటూ స్వాగతిస్తారు.

చలి దేశాల గిలిగింతలు

స్నోబాల్ (మంచు ముద్దల) కొట్లాటలు, స్నోమేన్ పోటీలు, వేడి వేడి చాక్లెట్ పానీయాలు, చలి మంట పక్కన పుస్తక పఠనాలు-కబుర్లు, ఎటు చూసినా ప్రేమజంటల అన్యోన్యాలు, గొంగళి కప్పుకున్నట్టుండే ఆహార్యాలు అన్నింటికీ మించి క్రిస్మస్ సంబురాలు చలికాలం వచ్చిందంటే శీతల ప్రాంతం గిలిగింతలు పెడుతుంది. మన సినిమాల్లో చూపించే ఆ దృశ్యాల్లా అంత సరదాగా ఉండదు కొన్ని దేశాల్లో. ప్రపంచంలో చలి కాలం వచ్చిందంటే ముడుచుకుపోయేందుకు ముందుండే దేశాల్లో ఎస్టోనియా, ఫిన్‌ల్యాండ్, మంగోలియా, ఐస్‌ల్యాండ్, గ్రీన్‌ల్యాండ్, అమెరికా, కజకిస్తాన్, కెనడా, రష్యా, అంటార్కిటికాలుంటాయి.

వోడ్కా విత్ పార

రష్యాకు వోడ్కా కిక్కెక్కించేది చలికాలమే. రష్యాలోని కొన్ని ప్రాంతాల్లో భానుడికి రెండు నెలలే రోజు హాయ్ చెప్పే అవకాశముంటుంది. చలికాలంలో మైనస్ 40 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోతాయి. అనుకోకుండా మంచు కురవడం దాన్ని తొలగించుకోవడం ఇలా సాధారణ జీవనంలో దిన చర్య అయిపోతుంది. దేశ రాజకీయాల నుంచి పక్కింటి కబుర్ల వరకు అన్నీ కూడా రోడ్డు పక్కన పారల్ని పట్టుకుని నలుగురూ మూగి మాట్లాడుకునే దృశ్యాలు కనిపిస్తుంటాయి. సైబీరియా ప్రాంతమైతే అదో మంచు ఎడారే. అక్కడ జీవనమంటే తీవ్ర శిక్ష అనుభవించినట్టే. చాలా పొడి వాతావరణముండే అక్కడ గుక్కెడు నీటితో నోరు తడుపుకోడానికి పెద్ద శ్రమే చేయాలి. ఇక కొండలతో నిండిపోయిన రష్యా పొరుగు దేశం కజకస్థాన్ పరిస్థితి మరీ దయనీయంగా ఉంటుంది చలికాలమొచ్చిందంటే. ఇక్కడ మంచుతో పాటు వర్షమూ కలసి కురిసి విచిత్ర వాతావరణం ఉంటుంది. అందుకే శీతాకాలం చలిపులి పంజాకు విలవిలాడిపోతుందీ దేశం.

ప్రపంచంలోనే అత్యంత వేడి ప్రదేశాల్లో ఒకటైన 'వ్యాలీ ఆఫ్ డెత్' ప్రాంతమున్న అదే అమెరికా దేశానికి మంచుగడ్డలా వణుకు పుట్టించే అలస్కా ప్రాంతం కూడా ఉంది. రష్యా నుంచి ఎప్పుడో కొనుక్కున్న ఈ ప్రాంతం ప్రధాన భూభాగానికి సంబంధం లేకుండా ఉంటుంది. అక్కడి వాతావరణం కూడా అలానే ఉంటుంది. మైనస్ 30 డిగ్రీలకు పడిపోయే చలికి అనేక చర్మ సమస్యలు, వ్యాధులు పీడిస్తుంటాయి. మంగోలియాను చూస్తే తూర్పు ఆసియా దేశాల్లోని సంస్కృతి ప్రతిబింబాల్లో ఒకటిలా తోస్తుంది. వసంతం వెల్లివిరిసే ఈ ప్రాంతవాసుల చిత్రాల్ని చూస్తే ఉష్ణమండల ప్రాంతమేమో అని భ్రమ కలుగుతుంది కానీ ఇక్కడా చలికాలం హిమతాండవం చేస్తుంది.

గడ్డ కట్టిన క్షణాలు

● మంచు యుగం నాటి పరిస్థితుల్ని సరిగా చూడలేదని ఆధునిక మనిషికి మరోసారి అదెంత తీవ్రంగా ఉంటుందో శాంపిల్ చూపించింది ప్రకృతి. 'లిటిల్ ఐస్ ఏజ్'గా పిలిచే ఆ కాలం ఓ పాతికేళ్లు కూడా లేదు కానీ యూరప్, అమెరికా ఖండాలు ఇక మంచులో కూరుకుపోతాయన్న కోల్డ్ స్ట్రోక్ ఇచ్చింది. క్రీ.శ. 1275-1300 మధ్య చెలరేగిన ఈ చలి ఉత్పాతానికి ఇంగ్లండ్‌లోని థేమ్స్ నది

చల్లచల్లగా...

● వింటర్ సోల్టైస్ డిసెంబర్ 21, జూన్ 21వ తారీఖున ఉంటుంది. ఆ రోజులో ఏడాదంతటి కంటే సూర్యుడు తక్కువ కాలం కనిపిస్తాడు. ఈ రెండు రోజులే అతి తక్కువ కాలపు పగలు.

● గిన్నిస్ రికార్డు ప్రకారం 1887లో జనవరి 28న మోంటానాలోని ఫోర్ట్ కియోగ్‌లో అతి పెద్ద మంచు బిందువు పడింది. ఇప్పటి వరకు కొలిచిన వాటిల్లో 15 అంగుళాల వెడల్పు 8 అంగుళాల మందంతో ఉన్న అదే పెద్దది.

● చియానోఫోబియా అంటే మంచు అంటే భయం. మంచులో కూరుకుపోతామేమోనని ఈ ఫోబియా ఉన్నవాళ్లు గడగడలాడిపోతారు.

● ప్రతి చలికాలంలో ఒక సెప్టిల్లియన్ (1 పక్కన 24 సున్నాలు పెడితే ఎంత సంఖ్య అవుతుందో అన్ని) మంచు స్ఫటికాలు ఆకాశం నుంచి కురుస్తుంటాయి.

● న్యూజిల్యాండ్‌కు చెందిన వేటా అనే కీటకం చలికాలంలో మొత్తంగా గడ్డకట్టుకుపోతుంది. మళ్లీ వేడిమి పెరిగితే మంచు కరిగి మళ్లీ బతుకుతుంది.

● ఓ మంచు తుఫాను సుమారు 4 కోట్ల టన్నుల మంచుతో ముంచేస్తుంది.

ఎందుకంత చలి?

భూమధ్య రేఖకు ఎంత దూరంగా ఉంటే వాతావరణం అంత ఎక్కువ శీతలంగా ఉంటుంది. భూమి కోణం కూడా దీనికి కారణం. రుతువులు మారేది భూమి కాస్త వంగి సూర్యుని చుట్టూ భ్రమించడం వల్లే. చలికాలంలో ధ్రువాలు సూర్యుడి ప్రభావం పడని ంగా 23.5 విధంగా డిగ్రీల కోణం వద్ద ఉంటాయి. పై ధ్రువం దూరంగా ఉంటే కింది ధ్రువం సూర్యుడి ముందుకు ఉంటుంది. దీనివల్ల ఒక వైపున ఎండాకాలం మొదలైతే మరో చోట చలికాలం ప్రారంభమవుతుంది.



పూర్తిగా గడ్డకట్టుకుపోయింది. మరికొన్ని నదులు కూడా యూరప్, అమెరికాల్లో స్తంభించాయి.

● పేరు వినగానే వెన్నులో చలి పుట్టించే అంటార్కిటికా ప్రాంతం భూమిపైన అతి శీతల ప్రాంతం రికార్డుకు పోటీ పడుతుంటుంది. అక్కడ మనిషి కాలుపెట్టడంతో మనం ఎరిగిన, చూసిన అతి తీవ్ర చలిని వోస్టాక్ బేస్ స్టేషన్ వద్ద ఉంటోన్న రష్యన్‌లు సాక్ష్యులయ్యారు. 1983 జులై 21న వారే కాదు ప్రపంచం మరిచిపోలేనంత తక్కువకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మైనస్ 89 డిగ్రీల సెంటీగ్రేడ్‌గా రికార్డయ్యింది. భూమ్మీద అత్యంత శీతలమైన ప్రదేశంగా అంటార్కిటికాలోని తూర్పు పీఠభూమిని పిలుస్తారు. అక్కడ మైనస్ 92 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు చేరుకుంటాయి ఉష్ణోగ్రతలు.

● శీతల ప్రదేశాల్లో చలి కాలం ఎప్పటికీ ఒకేలా ఉండదు. ఒక చోట ఉన్నట్టే వణుకు పుట్టీదు. ఎక్కడ ఎలా హిమ ఉత్పాతం గడ్డకట్టిస్తుందో తెలీదు. శతాబ్దికే అతి తీవ్ర మంచు తుఫానుగా పేర్కొనే గల్ఫ్ ఆఫ్ మెక్సికో వాతావరణం 1993 మార్చిలో విజృంభించింది. మొత్తం తూర్పు అమెరికా ప్రాంతాన్నే మంచుతో కప్పేసింది. చీలిపోయిన టోర్నడోలు, మంచు తుఫాను గాలులు గంటకు 193 కి.మీ. వేగంతో దడ పుట్టించాయి. ఫ్లోరిడాలోని జాక్సన్‌విల్లే సాధారణంగా మన ప్రాంత వాతావరణాన్నే కలిగిఉంటుంది. సూర్యుడి ఉనికిని హాయిగా అనుభూతి చెందొచ్చు. కానీ అలాంటి చోట 35 అడుగుల మేర మంచు దుప్పటి కప్పుకుంది. అలాంటి మంచు దాడి జరుగుతుందని చిన్న అనుమానం లేని ఆ ప్రాంతంలో ఆ మంచును తొలగించే ఏర్పాట్లు ముందస్తు చర్యలు ఏముంటాయి? అందుకే అంతా నగర జీవనం స్తంభించిపోయింది.

● మంచు లోకానికి ఆనుకుని ఉండే యూరప్‌కు మంచు యుగం వస్తుందేమోననే భ్రమని, భయాన్ని కలిగించింది 2012 సంవత్సరం. ఫిబ్రవరిలో డెడ్లీ కోల్డ్ వేవ్ యూరప్‌ను గడగడలాడించింది. ఆ ఆధునిక సమాజం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా 800 మరణాల్ని ఆపలేకపోయింది. మైనస్ 39.2 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోయిన ఉష్ణోగ్రతలు అనేక దేశాల్ని మంచు ముద్దల్ని చేశాయి. అంతకు ముందున్న ఎన్నో చలికాలపు రికార్డులు తుడిచిపెట్టుకుపోయాయి. యూరప్‌లోని రెండో అతిపెద్ద నది డ్యానుబె గడ్డ కట్టుకుపోయింది. వెనీస్ కాలువలు స్తంభించిపోయాయి. ఉత్తరాఫ్రికాలో సహారా నెగళ్లు మంచు వర్షంతో వణికిపోయాయి. చుట్టూ ఇసుకతో దుమ్ము తుఫాన్లతో కనిపించే పిరమిడ్ల ప్రాంతంలో తెల్లదనం జల్లుకుంది. లక్షలాది మంది మంచు దాడిలో ఇరుక్కుపోయారు.

● 1888లో అప్పటికి ఉన్న నగరీకరణ దృష్ట్యా చూసుకుంటే చలికాలంలో ఎంత వినాశనం జరిగిందో అర్థమవుతుంది. ఈశాన్య అమెరికా తీరంలోని 200 నౌకల్ని ధ్వంసం చేసేసింది మంచు తుఫాను. 400 మంది మృతిచెందారు. 1940 నవంబర్‌లో ఓ బ్లిజ్జర్డ్ (తీవ్ర చలిగాలి) క్షణాల్లో వాతావరణాన్ని, ఉష్ణోగ్రతల్ని ఊహించనంత తక్కువగా నమ్మశక్యం కానీ విధంగా మార్చివేసింది. ఉష్ణోగ్రత 60 డిగ్రీల ఫారెన్‌హీట్ కాస్తా ఒక్కసారిగా ఏక అంకె స్థాయికి పడిపోయింది. గాలులు గంటకు 129 కి.మీ. వేగాన్ని అందుకున్నాయి. 20 అడుగుల ఎత్తున మంచు పేరుకుంది. ఈ ఆశ్చర్యకర వాతావరణ మార్పు ఎంతో మంది ప్రాణాలను బలితీసుకుంది.

చలిసెగ ఎక్కువే

చలి, వేడిమి రెండూ తీవ్రతలే కానీ చలికాలంలోనే మనిషికి ఎక్కువ కష్టమని చాలా పరిశోధనల్లో తేలింది. మంచు యుగం నాటి నుంచే చలికి మనిషి మనగలిగేలా పరిణామం చెందినా ఇప్పటికీ కూడా శీతల ప్రాంతాల్లో జీవించేవారికి గుండె, నరాల వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది చలికాలం. 2013లో ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ బయోమెటియోరాలజీ అందించిన నివేదికలో చలికాలంలోనే వాతావరణ ప్రభావానికి కారణమయ్యే మరణాలు ఎక్కువగా ఉంటాయని తెలిసింది. మరో నివేదికలో ఎండా కాలంలో సంభవించే మరణాలు ఎండ తాకిడికి వెంటనే ఉంటాయి... అదే శీతాకాలంలో ఫ్లూ, ఆస్తమా వంటి సమస్యల కారణంగా కొన్ని రోజులు కొన్ని వారాల తర్వాత వరకు మరణాలు ఉంటాయి.
మైనస్ డిగ్రీలే కాదు మానవ శరీర ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెల్సియస్ కన్నా కొంచెం తగ్గినా హైపోథెర్మియా అనే ప్రాణాంతక పరిస్థితికి గురవుతాం. దీన్ని మంచు గాలి, వాతావరణం కొన్ని నిమిషాల్లోనే కలిగిస్తుంది. చర్మం, కణజాలం గడ్డకట్టుకుపోయి ఫ్రాస్ట్ బైట్ (చలి కాటు) తినేస్తుంది. ఎక్కువగా చేతులు, పాదాలు, వేళ్లు, కనురెప్పలు, పెదాల మీద దీని ప్రభావం పడుతుంది. ఈ ప్రభావాల నుంచి బయటపడాలంటే ఒళ్లంతా కప్పేసేలా దట్టమైన వస్త్రధారణ ఉండాలి.

వృథే కాదు ప్రకృతి మార్పు కథ కూడా.

ఆకు రాలే కాలానికి, వసంత రుతువుకు మధ్య ఉండే చలికాలం ఓ గొప్ప ప్రకృతి మార్పు కథ చెబుతుంది. నిర్జీవం నుంచి పునరుజ్జీవనానికి ఆ కథ నడుస్తుంది. ఆ కథ వలస జీవుల యాత్రతో భూమిలోని మరో ప్రాంతానికి వంతెన వేస్తుంది. అంతటా జీవం విస్తరించేందుకు దోహదపడుతుంది. అందుకే మనం సైబీరియా పక్షుల్ని మన కొల్లేటిలో చూస్తున్నాం. ఒక్కో ఖండాన్ని దాటుకుంటూ కొత్త జీవితం కోసం మనిషి నడిపిన మనుగడ ఘట్టాలన్నింటినీ ఓ విధంగా ముందుకు నెట్టింది చలికాలమే. చరిత్ర గతినే మార్చేసిన భూమి-మనిషి టైమ్‌లైన్‌లో ప్రతి ముఖ్య అధ్యాయంలో పెద్దక్షరాలతో అచ్చు వేయించుకుంది చలి కాలమే. శీతాకాల సుప్తావస్థలో మిగతా జీవులు మరో ఏడాది కోసం ఊపిరి నిలుపుకుంటే... మనిషేమో ఇగ్లూలో తలదాచుకుని తన ప్రస్థానాన్ని కదిలించాడు. కళ్ల ముందే ఎంతో చలనం కనిపిస్తున్నా అంతా గడ్డకట్టుకుపోయి స్తంభించిపోయిన భావన కలిగించే చలికాలపు మంచు కురిసే దృశ్యం ఈ ప్రకృతిలో ఎంత కదలిక తెస్తుందో! మంచు బిందువులు ఆకులు తాకుతున్న శబ్దం వెనుక ఎంత కథ నడుస్తుందో! రాబోయే కాలానికి, కొత్త జీవానికి ముద్ద దాచుకునే ప్రాణుల ఆరాటం ఓ వైపు, తాత్కాలిక మరణాన్ని మీదేసుకుని మళ్లీ భూమిని చీల్చుకు పుట్టే మొక్కల పోరాటం ఓ వైపు మనకు కనిపించకుండానే జరిగిపోతుంటాయి. ప్రకృతి

మంచు ముద్దలు

● రష్యా సైబీరియా లోపలి ప్రాంతంలో ఉండే వెర్ఖోయాన్స్క్, యాకుట్స్క్‌లోని ప్రజలు మిగతా ప్రపంచానికి భిన్నంగా మనుగడ సాగిస్తారు. ఇక్కడ కారు ఇంజిన్ ఇడ్లింగ్‌లో ఉంచే షాపింగ్‌లు చేస్తారు. ఇంజిన్ ఆగితే ఇక స్టార్టవడం కష్టం. గ్రీజ్ గడ్డకట్టి చక్రాలు, ఇరుసులు కదలకపోతే బ్లోటార్చ్‌తో మండించి కరిగిస్తారు.

● అమెరికాలోని మిన్నెసోటాలో ఉండే ఇంటర్నేషనల్ ఫాల్స్, కొలొరాడోలోని ఫ్రేజర్ ప్రాంతాలు ఆ దేశ ఐస్‌బాక్స్‌లు. మంచు కురుస్తూనే ఉంటుందీ ప్రాంతాల్లో.

● నార్వేలోని హెల్ ప్రాంతం పేరుకు తగ్గట్టే గజగజలాడిస్తుంది. ఆర్కిటిక్ వలయంలో ఉండే ఈ ప్రాంతంలోని రైల్వే స్టేషన్ ఒక్కోసారి పూర్తిగా మంచుతో కప్పబడిపోతుంది. ఓ చిన్న మంచు గుట్టను ఎక్కినట్టుగా ప్రజలు అక్కడకు చేరుకుని రైల్వేస్టేషన్‌కు సంబంధించిన ఏదైనా చిహ్నం కనిపిస్తే సెల్ఫీ తీసుకుని ముచ్చటపడతారు.

● పెర్మాఫ్రాస్ట్ మీద రూపొందిన నగరం అలాస్కాలోని బారో. వందల అడుగుల లోతుండే మంచు ఫలకం మీద నిలబడిన ఈ నగరంలో నవంబర్‌లో బై చెప్పిన సూర్యుడు తిరిగి కనిపించేది జనవరి చివర్లోనే. ఈ నగరానికి చేరుకోవాలంటే వాయు లేదా జల మార్గమే దిక్కు. జల మార్గమంటే పడవేసుకుని తిన్నగా వెళ్లిపోవడం కాదు ఐస్ బ్రేకింగ్ షిప్‌ల వెంట గడగడలాడుతూ వెళ్లడం.

● వైట్ నది అనే పేరుతో కెనడాలో ఓ నది ఉంది. పేరుకు తగ్గట్టే అది తెల్లగా కనిపిస్తుంది. కారణం అదో హిమానీ నదం. దీని లోయ ప్రాంతానికి ఆనుకుని ఉండే స్నాగ్‌లో మనిషి చొరబడింది గోల్డ్ రష్ కాలమపుడు. కాలు మోపాడు కానీ ఏడాదంతా చలికాలంలాగే తోచే ఆ ప్రాంతంలో రోజూ సతమతమవుతూ కనిపిస్తాడు.

మంచు దుప్పటి కప్పుకుంటే మనం స్వెట్టర్‌లు, చలి కోటులేసుకుంటాం. మరి వన్యప్రాణులేమో సహజసిద్ధ మార్పులతో చలి కాచుకుంటుంటాయి. కొవ్వును ఎక్కువ నిల్వ చేసుకునో, వెంట్రుకల్ని దట్టంగా, మందంగా పెంచుకునో, తెల్లదనానికి తగ్గట్టు శరీర ఛాయను మార్చుకునో మనుగడ పోరాటం సాగిస్తుంటాయి. కృత్రిమత్వం వైపు మనిషి పరుగు మొదలయ్యాక వాటి ప్రత్యేకతల్ని మనం కోల్పోయాం. దూరంగా కదిలిపోయాం.

సోలార్ 'పవర్' కోట్

చలికాలంలో స్వెటర్, వానాకాలంలో రెయిన్ కోట్‌లానే.... ప్రస్తుతం ఎలక్ట్రిక్ గ్యాడ్జెస్ హవా నడుస్తుండటంతో 'పవర్ కోట్'కి డిమాండ్ పెరిగింది. వీటిని జపాన్‌కి చెందిన జున్యా వట్నబె డిజైన్ చేశాడు. కాస్త ఎక్కువ ఖరీదే అయినా జనం అంతలా ఎగబడి కొనేయడానికి కారణం మనతో వుండే గ్యాడ్జెట్స్‌కి ఎక్కువ సమయం ఛార్జింగ్‌ని అందించడం. కోట్‌కి ఇరువైపులా అమర్చిన సౌరఫలకాలు సూర్యుడి నుండి గ్రహించిన వేడిని విద్యుత్ శక్తిగా మార్చుతాయి. పవర్‌ప్యాక్‌ల్లో నిక్షిప్తమయ్యే ఈ విద్యుత్‌ను కేబుల్‌ల ద్వారా మన ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లకి చార్జింగ్ అందించేలా తయారు చేశాడు. ఇంటిని అంటిపెట్టుకుని ఉండే వారి సంగతేమో కానీ అలా సరదాగా ఓ వారం రోజులు బయటి ప్రపంచాన్ని చూసొద్దామనుకునేవారికి మాత్రం తను డిజైన్ చేసిన ఎఫ్.డబ్ల్యు 16 సోలార్ పవర్ కోట్‌లు కచ్చితంగా ఉపయోగపతాయంటున్నాడు జున్యా వట్నబె. అయితే ఇవి ప్రస్తుతానికి పురుషులకు మాత్రమే అందుబాటులో వున్నాయి. త్వరలోనే మహిళలు, చిన్నారులకు కూడా డిజైన్ చేస్తాడట.

ఉడుత సాయం



కొంత మందికి చిన్న చిన్న జంతువులు కూడా ఇట్టే మాలిమైపోతుంటాయి. వాళ్ల సైగల్ని అర్థం చేసుకుని చెప్పినట్టు చేసేస్తుంటాయి. అదెలా సాధ్యపడుతుంతో తెలియాలంటే 22 ఏళ్ల మేరిని అడగాలి. ఎందుకంటే తనో చిట్టి ఉడుతతో దోస్తీ చేస్తోంది. అమెరికాలోని పెన్ స్టేట్ యూనివర్సిటీలో ఇంగ్లీష్, వైల్డ్‌లైఫ్ సైన్స్‌లో డిగ్రీ చదవుతున్న మేరీకి క్యాంపస్‌లో నాలుగేళ్ల క్రితం ఒక ఉడుతల గుంపు కనిపించడంతో వాటికి ఆహారాన్ని అందించింది. ఇలా రోజూ ఆహారం ఇస్తుండడంతో ఆ గుంపులో ఒక ఉడుత మాలిమయ్యింది. మొదట్లో ఆ ఉడుతకి ఒక టోపీ తయారుచేసి దాని తలపై ఉంచేందుకు చాలానే కష్టపడాల్సొంది. దాంతో దోస్తీ చేస్తూ కొన్నాళ్లకి ఒక సెల్ఫీ దిగి వాటిని తన నానమ్మకు పంపించింది. ఆ ఫోటోలను నానమ్మ ఎంతగానో ఇష్టపడుతుండటంతో రకరకాల టోపీలతో ఉడుతకి ఫొటోలు తీయడంతోపాటు, దాంతో ఆటలాడుకున్న ఫోటోల్ని ఆమెకు పంపేది. తన ఫేస్ బుక్‌లో ఫోస్ట్ చిత్రాలనిన్నంటికి మంచి స్పందన లభించింది. చాలా కాలం ఇంటర్‌నెట్‌లో హల్‌చల్ చేసిన ఈ చిత్రాలు మేరీకి కూడా గుర్తింపు తెచ్చిపెట్టాయి. వాటితో ఆడుకోవాలనిపించినప్పుడల్లా వాటికి వెన్న, వేరుశనగ గింజల్ని అందించేది. అప్పుడుగానీ అవి మాట వినవు మరి. ఉడుతలకి ఆహారం అందిస్తున్న సమయంలో వాటి గురించి తెలుసుకునేందుకు కొందరు తనతో మాట కలిపేవారు. యాస్పెర్జెర్స్ సిన్డ్రోమ్ కారణంగా స్నేహితులతో కలివిడిగా ఉండలేని మేరీ ప్రవర్తనలో ఉడుత స్నేహం ద్వారా ఎంతో మార్పొచ్చింది. తను చెప్పే మాటల్ని చెవికెక్కించుకునే ఈ ఉడుత ద్వారా పర్యావరణ పరిరక్షణ సందేశాల్ని ఇస్తోంది మేరీ. 'సేవ్ ది వరల్డ్', 'బ్యాక్ టు స్కూల్' ప్లకార్డులతో కనిపించే ఈ ఉడుత ఫొటోలు నెట్టింట్లో తెగ సందడిచేస్తున్నాయి.

వింత లోకం

గ్లోవ్ ఫొటోగ్రాఫర్

మనం ఒక సారి దేనిగురించైనా తెలుసుకుంటే అది మనకి ప్రతిచోటా తారస పడుతుందంటాడు బ్రిటన్‌లోని సుర్రే ప్రాంతానికి చెందిన మార్క్‌లీ. ఇతనిలా అనడానికి తన పరిశోధనే కారణం. మార్కెటింగ్ రంగంలో ఉన్నపుడు మార్క్‌లీకి ఆఫీస్ మెట్ల దగ్గర పడివున్న ఒక చేతి తొడుగు(గ్లోవ్) వింతగా కనిపించింది. దాన్ని తను తీసుకున్నాడట. అయితే మరుసటి రోజు రోడ్డుపై మరో చేతి తొడుగు పడివుండటాన్ని గమనించాడు. ఇలా మార్క్‌లీ ఎక్కడికెళ్లినా ఎక్కడో ఒక చోట పాత చేతి తొడుగులు తారసపడూతూ వుండటం తనని ఆశ్చర్యానికి గురిచేసింది. ఇందులో ఏదో రహస్యం దాగుందనిపించిందతనికి. అప్పటి నుండి ఎక్కడికెళ్లినా తన కళ్లు డిటెక్టివ్‌లా పాత గ్లోవ్స్‌ని వెతుకుతుండేవట. వింతగా అనిపించిన చేతి తొడుగులన్నీటినీ ఫోటో ఫ్రేముల్లో బంధించేందుకు ఫొటోగ్రఫీ కూడా నేర్చేసుకున్నాడు. తీరికున్నప్పుడల్లా రైల్వేస్టేషన్లు, పాఠశాలల వద్దకి చేరుకుంటూ అక్కడ పడివున్న చేతి తొడుగుల్ని కెమేరాలో బంధించేవాడు. ఇప్పటి దాకా తను వెతికి పట్టుకున్న 300 చేతితొడుగుల్ని చిత్రాల్లో పదిలపరిచాడు. 'ఇదేం వింత హాబీ!' అంటూ కుటుంబ సభ్యులు తల పట్టుకున్నా పేపర్‌లో తన పేరున వచ్చిన ఒక కథనం చూసి తెగ సంబరపడిపోయాడు. ఇంతకీ మార్క్‌లీ పేరు పేపర్‌లో అచ్చయ్యేంతలా ఏం చేశాడనేగా మీ సందేహం. తన పరిశోధన కోసం ఒక రోజు బ్రిటన్‌లోని ఒక మారు మూల గ్రామానికి చేరుకున్నాడు మార్క్ లీ. న్యూ రోమ్నీ బీచ్ తీరంలోని కెంట్ ప్రాంతం అది. ఇక్కడే ఒక శ్మశాన వాటిక ఉంది. దాని చుట్టూ కర్రలతో ఏర్పాటుచేసిన ఒక కంచె కనిపించిందతనికి. వింతేంటంటే ఇక్కడ ఒక్కో కర్రకి ఒక్కో చేతి తొడుగు ఉంటుంది. వీటిని అక్కడ ఎవరు వదిలెల్లారనే వివరాలు తెలీకపోయినా బ్రిటన్‌వాసులకి 'గ్లోవ్ గ్రేవ్‌యార్డ్'ని పరిచయం చేసిన వ్యక్తిగా జనం మదిలో చోటు దక్కించుకున్నాడు మార్క్‌లీ.



వినూత్నం

పుస్తక ప్రియులకు మాత్రమే!

పుస్తకం చదవడం పూర్తవకుండా నిద్ర పోని వారు కొందరైతే. కొత్త పుస్తకాల్లో పడి రోజంతా లైబ్రరీలో గడిపేసేవారు మరికొందరు. పుస్తకాలనీ, లైబ్రరీలని అంటిపెట్టుకునుండే పుస్తక ప్రియుల కోసం బుక్ అండ్ బెడ్ ఆలోచనతో ముందుకొచ్చింది జాపాన్‌కి చెందిన ఒక ప్రైవేటు సంస్థ. శతాబ్దాలుగా కవులు, రచయితలకు సాహిత్య పుస్తకాల ద్వారా స్ఫూర్తినిచ్చిన జపాన్ పురాతన రాజధాని టోక్యోలో పాత హాస్టళ్లు, కేఫ్‌లను పుస్తకశాలలుగా మార్చిన బుక్ స్టోర్ అండ్ లైబ్రరీ థీమ్‌డ్ హాస్టల్ మరో శాఖ ఈ బుక్ అండ్ బెడ్ అండ్ బీర్ హాస్టల్.



సాధారణంగా బుక్ షాపులు, లైబ్రరీల్లోకి అడుగుపెట్టగానే వేలాదిగా ఉండే పుస్తకాలతో పాటు పుస్తకం చదువుతూ కొందరు కూర్చున్న చోటే కునుకు తీసే దృశ్యాలూ కనిపిస్తాయి. పుస్తక పఠనం అంటే ఇష్టపడే వారందరూ కాస్త సేద తీరుతూ తమ అభిరుచిని ఫాలో అయ్యేందుకు వీలుగా డిజైన్ చేయబడింది బెడ్ అండ్ బుక్స్ సంస్థ. చాలా కాలంగా జపనీస్ సంస్కృతి, కళల్లో భాగమైన క్యోటో ప్రకృతి ప్రేమికులకి, ప్రయాణ ఔత్సాహికులకి అనువైన ప్రదేశంగానే ఎక్కుమందికి తెలుసు. డిసెంబర్ మొదటి వారంలో సపోజ్ డిజైన్ ఆఫీస్ వ్యవస్థాపకుడు మకోటో టనిజిరి ద్వారా గోయిన్ జిల్లాలో ప్రారంభమైన 'బుక్ అండ్ బెడ్' హాస్టల్ క్యోటో నేడు బ్యాక్ ప్యాకర్‌లకి, పుస్తక ప్రేమికులకి కూడా అనువైన ప్రదేశంగా మారిపోయింది. స్థానికులతోపాటు కొత్తగా పుస్తకాలని చదివేందుకు వచ్చేవారి కోసం వివిధ అంశాలకు సంబంధించిన 5000 పుస్తకాలు ఇంగ్లీష్, జపనీస్ రెండు భాషల్లో ఇక్కడ అందుబాటులో ఉన్నా అధిక శాతం జపనీస్ భాషని కలిగుంటాయి. ఈ నిర్మాణం మధ్య ప్రాంతమంతా పుస్తకాల అరలు, అల్మారాలతో నిండిన పుస్తకాలతోపాటు సీలింగ్‌కి వేలాడుతుండే పుస్తకాలతో ఆ ప్రాంతమంతా ఒక భూతల స్వర్గాన్ని తలపిస్తుంది. మరో ఫక్క పుస్తక ప్రియులకు విశాలంగా ఉండే నీలిరంగు సోఫాలు స్వాగతం పలుకుతాయి. కాస్త రిలాక్స్‌డ్‌గా పుస్తకాలను చదువుకోవాలనిపిస్తే బుక్ షెల్ఫ్‌ల వెనకాల కేటాయించిన సింగిల్ బెడ్‌లని

వినియోగించుకోవచ్చు. వాటినే బుక్‌షెల్ఫ్ అని పిలుస్తారు. 'కంప్యాక్ట్', 'స్టాండర్డ్', రివర్ వ్యూ ఇలా మూడు రకాలుగా వర్గీకరించిన మొత్తం 20 పడకలున్న ఈ లైబ్రరీలో ఒక్కోటి ఒక్కో ప్రత్యేకతని చాటుతుంటాయి. కమొ నదీ తీరంలో ఏర్పాటు చేసిన బుక్ అండ్ బెడ్‌లో పుస్తక పఠనంతో పాటు సుందరమైన కమొ నదిని వీక్షించేందుకు వీలుగా ఏర్పరిచిన పడకల్ని రివర్ వ్యూ బెడ్స్ అంటారు. పుస్తకాల అరలకి వెనుక విశాలవంతంగా ఉండే చెక్క అరల్లో అమర్చిన పడకల్ని స్టాండర్డ్‌గా, కాస్త తక్కువ విశాలంగా ఉండే పడకల్ని కంప్యాక్ట్ బెడ్స్‌గా పిలుస్తారు. ఇవి ఎలక్ట్రిక్ అవుట్‌లెట్, బెడ్ లైట్స్ వుంటాయి. పుస్తకాల అరలకి, బెడ్స్‌కి మధ్య ఖాళీ ప్రదేశం కర్టెన్‌లతో అందంగా అలంకరించబడి ఉంటుంది. ఇక రాత్రిళ్లు ఇక్కడ బసచేసి మరీ పుస్తకాలు చదువుకునే వారికి అదేనండీ బెడ్‌టైమ్ రీడర్స్‌కి సౌకర్యవంతమైన యుకార్తా స్టైల్ పైజమా, బీర్‌లని కూడా అందిస్తారు. బుక్ లైట్స్, వైఫైలతో పాటు షేరింగ్ టాయిలెట్స్, బట్టల హ్యాంగర్స్, ఇలా అన్నీ మన ఇంటి వాతావరణాన్ని తలపిస్తాయి. అయితే వీటి కోసం 30-40 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. కొన్ని వారాల ముందే డబ్బులు చెల్లించి ప్రవేశాన్ని రిజిస్టర్ చేసుకోవాలి. శని, ఆది వారాలు సెలవు రోజుల్లో బుక్ అండ్ బెట్ ప్రవేశ రుసుము ధరలు కాస్త ఎక్కువగా ఉన్నా ప్రయాణంతో పాటు పుస్తకాలని చదువుతూ ఓ రోజు గడిపేయడం బ్యాక్ ప్యాకర్స్‌కి ఒక కొత్త అనుభూతినిస్తోంది.





మనిషి ని
ఈజిప్టుల
పిరమిడ్
పైగా ఉ
ఎవరికీ
సాక్ష్యాలు
పిరమిడ్ల
అయితే
అనేక
తెలుసుకో

గ్రీకు భాషలో 'పైరో' లేక 'పిరో' అంటే అగ్ని అని, 'అమిడ్' అంటే 'మధ్యం' అని అర్థం. గ్రీకుల ద్వారా పిరమిడ్‌కు 'అగ్ని మధ్యం' అనే అర్థం వాడుకలోకి వచ్చింది. పిరమిడ్‌లపై ఎంతో మంది పరిశోధనలు చేశారు. వాటికి సంబంధించి కొన్ని విశేషాలను వెలుగులోకి తెచ్చారు. మధ్య ప్రాచీన దేశాలలోని క్రీస్తు పూర్వం 3000 సంవత్సరాల నాటి విజ్ఞాన ప్రగతికి పిరమిడ్‌లను నిదర్శనంగా చెబుతారు. అయితే ప్రపంచంలో ఎన్ని పిరమిడ్‌లున్నాయనేది ఇప్పటికీ ఎవరూ కనిపెట్టలేకపోయారు. ఇది అంచనాలకు అందని ప్రశ్నగానే మిగిలిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా ఎన్ని పిరమిడ్‌లున్నాయో లెక్కించి వాటి సంఖ్య చెప్పడం ఎవరి వల్లా కాని పనే అయినా పిరమిడ్‌లు అన్నీ ఒకే ఆకారంలో లేవనేది వివిధ పరిశోధనల్లో తేలిన నిజం. మెక్సికో, చైనాలో కనిపించే పిరమిడ్‌లు ఒకలా ఉంటే, ఇంగ్లాండ్‌లోని సిల్బరిహిల్ పిరమిడ్ మరోలా ఉంటుంది. స్థానిక వాతావరణ పరిస్థితులకు అనువుగా పిరమిడ్‌ల నిర్మాణం జరగడంతో ఒక్కో ప్రాంతంలో ఒక్కో రూపంలో మనకు పిరమిడ్‌లు కనిపిస్తాయి. ఇటలీ, సాల్వేనియా, ఆస్ట్రేలియా, రష్యా ఇండోనేషియాలోని పిరమిడ్‌లపై కొన్నేళ్ల పాటు అనేక పరిశోధనలు జరిగాయి. వాటిపై ఒక సంక్షిప్త నిర్ధారణకు వచ్చిన అనంతరం ప్రపంచ వ్యాప్తంగా పిరమిడ్‌లు నాలుగు రూపాలలో ఉన్నట్లు నిర్ధారించబడింది. యూకటన్, ఎల్ మిరడర్ లా డాంటా, గ్వాటెమాలా పిరమిడ్‌లను గురించి వినే ఉంటారు.. ఒక్క ఈజిప్టులోనే 120 దాకా పిరమిడ్‌లు మనకు కనిపిస్తాయి. వీటి నిర్మాణాల్లో ఉపయోగించే పదార్థాలు, సాంకేతికత ఒక దానికొకటి విభిన్నంగా ఉంటాయి. మెక్సికో, బెలిజి, హోండురస్, ఎల్ సాల్విడారో, అమెరికాలోని సెయింట్ లూయిస్, ఇల్లినాయిస్, దక్షిణ అమెరికాలోని పెరులోని కుస్కొ గ్రీస్, ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీలోని పిరమిడ్‌లపై కూడా అనేక మంది అధ్యయనం చేశారు. వీటి గురించి మనం తరుచూ వింటూనే ఉంటాం. అక్కడో ఇక్కడో చదివే ఉంటాం. కొద్దో గొప్పో తెలుసుకునే ఉంటాం. మనమెన్నడూ వినని, తెలుసుకోని అతి ముఖ్యమైన ప్రాచీన పిరమిడ్‌ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

మౌంట్ డి అక్కొడీ

ఇటలీలోని ఉత్తర సార్డీనియాలో ఒక ప్రాచీన పురాతత్వ ప్రదేశం మౌంట్ డి అక్కొడీ. పోర్టో టొరైస్ సమీపంలోని సస్సారి భూభాగంలో ఎలాంటి కాంక్రీట్ లేకుండా కేవలం పెద్ద రాళ్లను పేర్చి మెగాలిథిక్ శైలిలో ఈ పిరమిడ్ నిర్మాణం జరిగింది. క్రీస్తు శకం 4000 – 3650 లకు చెందిన ఈ పిరమిడ్‌ని 1954లో కనుగొన్నారు. ఇది 5.5 మీటర్ల ఎత్తు, 27-27 చదరపు మీటర్ల వెడల్పు వుంటుంది ఈ నిర్మాణం. ఈ పిరమిడ్ ప్రవేశం 12.5 – 7.2 మీటర్ల ఎత్తున ఏటవాలుగా ఉంటుంది. దీనిని సింగిల్ స్టెప్ పిరమిడ్ ఆలయంగా పిలుస్తారు.

గ్రేట్ పిరమిడ్ ఆఫ్ చోళులా

అతి పెద్ద పురాతత్వ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన మెక్సికోలోని చోళులా ప్రాంతంలో వుంది ఈ పిరమిడ్. ఉపరితలానికి 180 అడుగుల ఎత్తులో మొత్తం 400/400 మీటర్ల పరిధిలో దీన్ని నిర్మించారు. మెక్సికో నాగరికత ఈ పిరమిడ్‌లో మనకు కనిపిస్తుంది.

గ్రీక్ పిరమిడ్స్

వీటిని అర్గోలి పిరమిడ్‌లు అని కూడా పిలుస్తారు. గ్రీసులోని అర్గోలిడ్ భూభాగంపై ఏర్పడిన అనేక పిరమిడ్‌లలో హెల్లిన్కన్ పిరమిడ్ బాగా ఖ్యాతి పొందింది. ఒకప్పుడు దీన్నే గ్రీకుల సమాధిగా పేర్కొన్నారు.

సెస్టియస్ పిరమిడ్

ఇది ఇటలీలోని అతి ప్రాచీన పిరమిడ్. రోమ్‌లోని పోర్టా సాన్‌పావ్‌లో, ఇటలీలోని ప్రొటెస్టెంట్ శ్మశానానికి సమీపంలో ఉంది. అతి ప్రాచీనమైన రెండు రోడ్ల మధ్య ఒక ఫోర్క్ ఆకారంలో దీన్ని నిర్మించారు. ఇది క్రీ.పూ.18-12 శతాబ్దాల కాలం నాటి కట్టడంగా చరిత్రకారులు వెల్లడించారు. ఇటుక రాళ్ళతో నిర్మించిన ఈ కట్టడాన్ని రోమ్‌లోని నాలుగు ప్రధాన మత సంస్థలకు మెజిస్ట్రేట్‌గా, సభ్యుడిగా పనిచేసిన గెయిస్ సెస్టియస్ సమాధిగా కూడా పరిగణిస్తారు. పాలరాతి శ్లాబ్‌ని ఇక్కడ చూడొచ్చు. పీఠభూమిపై 29.6 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 125 మీటర్ల ఎత్తులో సెస్టియస్ పిరమిడ్ నిర్మాణం జరిగింది.



సెస్టియస్ పిరమిడ్

రమిడ్ ప్రపంచం

ర్మించిన కట్టడాల్లో పిరమిడ్‌లు ఎంతో ఆకర్షణీయమైనవి. ని గిజా ప్రాంతం పిరమిడ్‌లకు ప్రసిద్ధి చెందింది. గిజా చాలా పెద్దది. బరువైనది కూడా. ఇలాంటివి ఈజిప్టులో 30 న్నాయి. ఇక చిన్న పిరమిడ్‌ల లెక్కతేల్చడం ఇప్పటి వరకూ సాధ్యపడలేదు. ఈజిప్షియన్ల విజ్ఞానానికి నిలువెత్తు గా నిలిచి వారికి ప్రపంచ స్థాయి ఖ్యాతిని తెచ్చిపెట్టిన పై ఇప్పటికీ పరిశోధనలు కొనసాగుతూనే ఉన్నాయి. రమిడ్ అనగానే ఈజిప్టు గుర్తొచ్చినా ప్రపంచ నలుమూలల్లో చోట్ల వాటిని మనం చూడొచ్చు. ఆ విశేషాలు వాలంటే మీరూ పిరమిడ్ లోకంలోకి అడుగేయాల్సిందే.


మడఘూసెన్


నుబియన్ పిరమిడ్

నుబియన్ పిరమిడ్స్

ఈజిప్టు రాజులు, కుషిట్ పాలకులు నుబియన్ పిరమిడ్‌లని నిర్మించారు. ప్రస్తుత సూడాన్‌లో కుష్టి నగరం ఉంది. కుషిట్‌లు దీని నిర్మాణాన్ని పూర్తిచేశారు. 500 సంవత్సరాలకి ముందు ఈజిప్టులోగానీ, నైలు నది లోయలోగానీ ఎలాంటి పిరమిడ్‌ల నిర్మాణం లేదు.

నైలు నదిలోయనే నుబియాగా ఖ్యాతి గడించింది. పూర్వకాలంలో ఇది మూడు కుషిట్ మహాసామ్రాజ్యాలకు కేంద్ర బిందువుగా నిలిచింది. క్రీపూ 2600–1520ల మధ్య కాలంలో కెర్మా పాలకులకు రాజధానిగాను, క్రీ,పూ.1000–300లో నపాటకు కేంద్రంగాను, క్రీ,పూ. 300 –క్రీ.శ. 300) మధ్య కాలంలో మియరో రాజులకు రాజధానిగాను నిలిచింది ఈ ప్రాంతం.

మడఘూసెన్

బెర్బర్ నుమిడియన్ పాలకుల రాచరికపు సమాధిగా ఈ పిరమిడ్‌ను పేర్కొంటారు. ప్రస్తుత అల్జీరియాలోని నుమిడియాలో ఉన్న అవ్‌రాసియాస్ మాన్స్ దగ్గర బటనా నగర సమీపంలో ఈ పిరమిడ్ ఉంది. నుమిడియా స్వతంత్ర రాజుల్లో మడ్‌ఘీస్ ఒకరు. క్రీ.పూ.300–200 మధ్య కాలంలో నుమిడియాను మడ్‌ఘీస్ పాలించారు. వీరికి అంతకు ముందు రోమన్ రాజులతో సన్నిహిత సంబంధాలున్న ఆనవాళ్లు ఈ పిరమిడ్ నిర్మాణాల్లో ఉట్టిపడతాయి.

లా క్యుమడవోటివ్ పిరమిడ్

ఇది మీసో అమెరికన్ పురాతత్వ ప్రదేశం. చికోమోజియాక్‌గా ఇది పేరు పొందింది. లా క్యుమడవ్ రాతి వేదికలపై వివిధ పరిమాణాల్లో ఈ పిరమిడ్‌లను నిర్మించారు. ప్రధానంగా పర్వత ప్రాంతాలపై ఈ కట్టడాలు మనకు కనిపిస్తాయి. దక్షిణ, ఆగ్నేయ ప్రాంతాల్లో పిరమిడ్ ఆకారంలో ఉన్న సమాధులు మనకు కనిపిస్తాయి. పల్లపు డాబాలపై కొన్ని క్లిష్టమైన కట్టడాలు కూడా ఉన్నాయి. వోటివ్ పిరమిడ్ ఎత్తు 10 మీటర్ల పైనే ఉంటుంది. వంకరగా ఉండే దాని కోణాలు పిరమిడ్ ప్రత్యేకతను చాటి చెబుతాయి. 1995 ప్రాంతంలో కరోనా న్యూనెజ్ పనుల సమయంలో ఏటవాలు మెట్లు నిర్మించారు. లా క్యుమడవోటివ్ పిరమిడ్‌కు దక్షిణ భాగాన వాటిని మనం చూడొచ్చు.

కోహ్‌కెర్ పిరమిడ్

ఉత్తర కంబోడియాకు 120 కిలోమీటర్ల దూరంలోని మారుమూల ప్రాంతాల్లో కోహ్‌కెర్ పిరమిడ్లు మనకు కనిపిస్తాయి. ఇది దట్టమైన అడవి ప్రాంతం. అక్కడక్కడ మాత్రమే జన సంచారం ఉంటుంది. క్రీ.శ. 928–944 లో జయవరమాన్–4, హర్షవరమాన్–2లు కోహ్‌కెర్‌ను రాజధానిగా చేసుకుని పాలించారు. జయరామన్–4 ఇక్కడ పలు నిర్మాణాలను చేపట్టాడు. ఆయన పాలనలో 40 ఆలయాలను పెద్ద వాటర్ ట్యాంక్‌ను నిర్మించాడు. ఇవి అద్భుతమైన కట్టడాలు. అయితే ఈ ప్రదేశం మొత్తం చూడటానికి ఒక పిరమిడ్‌లా ఉంటుంది. 118 అడుగుల ఎత్తులో, దాదాపు ఏడు అంతస్తుల్లో కోహ్‌కెర్ పిరమిడ్ ఉంది.

గ్యుమార్ పిరమిడ్

లావా రాళ్ళతో ఆరు దీర్ఘచతురస్రాకారాల్లో ఈ పిరమిడ్‌ని నిర్మించారు. దీని చుట్టూ టెర్రస్‌ల నిర్మాణం కూడా జరిగింది. కానారి దీవుల్లో టెనరైఫ్ ఒక ద్వీపం. ఈ ద్వీపంలోని కోనా జిల్లాలో వుంది గ్యుమార్ పిరమిడ్. 19వ శతాబ్దం నాటి సమకాలీన వ్యవసాయ పద్ధతులను ఆధారంగా చేసుకుని దీనిని నిర్మించినట్లు చెపుతుంటారు.

సుఖు పిరమిడ్

జావా రాష్ట్రంలో ఉంది సుఖు పిరమిడ్. జన్మకు ముందు జీవితం, లైంగిక విషయాలు ప్రధానాంశాలుగా శిల్పులు ఈ పిరమిడ్‌ను చెక్కారు. ఇది 15వ శతాబ్దానికి చెందినదిగా గుర్తించారు. ఇండోనేషియా జాతీయ మ్యూజియంగానూ సుఖు పిరమిడ్ గుర్తింపు పొందింది.

–కెఎస్‌ఎమ్

ఇప్పటి పిల్లలూ....

వాళ్లకు దెల్వని చీకటి గుహల్లోకి
బలవంతంగా నెట్టకండి
ఊచలు బిగించిన అక్షరశాలలకు పంపకండి
దడ్చుకుంటరు.. చలిజ్వరంతో ముడ్చుకుంటరు
వాళ్ల వెన్నెల మరకల్ని వాళ్లకే అంటనివ్వండి
చీకటిని చీలుస్తూ వెళ్లే కత్తి యుద్ధాలను నేర్వనివ్వండి

మీరు ఇష్టంగా అందంగా తయారు చేసుకున్న
పూలకుండీల్లోకి విసరకండి
దడ్చుకుంటరు.. చలి జ్వరంతో ముడ్చుకుంటరు
ఆకాశం దాకా రెక్కలు చాచి
పక్షి పూల గీతమయి సాగనివ్వండి

నెరవేరని మీ కోరికలాశల సిమెంట్ చప్టా మీద
చేపల్లా రుద్ది వాళ్లను పొలుసులు పొలుసులుగా విడిపోనివ్వకండి
దడ్చుకుంటరు... చలిజ్వరంతో ముడ్చుకుంటరు
విజ్ఞాన గంగలో బంగారు చేపల్లా ఇష్టంగానే ఈదనివ్వండి

మీరు రచించి పారేసిన ఎంగిలి గీతాలను
బలవంతంగా వాళ్ల కంఠాల్లో కూరకండి
దడ్చుకుంటరు... చలి జ్వరంతో ముడ్చుకుంటరు
పల్లవులూ....చరణాలు వాళ్లనే కూర్చుకోనివ్వండి
మీ అనురాగంలోంచి సరికొత్త రాగమయి పాడనివ్వండి

పూల చెట్లకు ఇనుప గొలుసులు వేసి లాగకండి
తూనీగల రెక్కలకు మీ అభిప్రాయాల దారాలు కట్టి ఎగరమనకండి
దడ్చుకుంటరు... చలి జ్వరంతో ముడ్చుకుంటరు
ఎగిరినంత మేర ఆకాశాన్ని
తమ రెక్కల్లో స్వేచ్ఛగా ముడ్చుకోనివ్వండి
తూనీగల దండయి సమాజపు మంచి చెడులను కొలవనివ్వండి
మీ ఆకాంక్షల సాలె గూట్లోకి వాళ్లను ఈగల్లా లాగకండి
వాళ్లకిష్టమయిన కలల తోటల్లో పక్షుల్లా ఎగరనివ్వండి
వాళ్ల రంగుల ప్రపంచాన్ని వాళ్లే.. వాన విల్లుతో సంధించనివ్వండి

మీ కలలూ కథలూ చెప్పి మీదయిన లోకంలో
బోన్సాయి వృక్షాల్లా పెంచకండి దడ్చుకుంటరు...
చలి జ్వరంతో ముడ్చుకుంటరు
వాళ్ల కలలూ కథల్ని వాళ్లనే రచించుకోనివ్వండి
మహా వృక్షాలై ఎదగిన వాళ్ల నీడల్లో
ఈ సమాజాన్ని హాయిగా సేదదీరనివ్వండి

- చిత్తలూరి,9133832246



వేదన బరువై
కాలిన అగ్గిపుల్ల తల్లో
మిగిలిన చీకటిలా మెరుస్తోంది

ఎటువెళ్లాల్లో తెలీని
మబ్బు ముక్కలు తెల్ల మొహాలేస్తున్నై

చెప్పాపెట్టకుండా
దిగులు చెట్టు గుబురైంది

అంతుచిక్కని ఒకే ప్రశ్న
ఆకాశమంతై పరచుకుంది

బంధాల్ని ఒలికిపోకుండా
పట్టుకునే ఒడుపు లేకే
మనుగడ ఆపద్ధర్మం అవుతోంది

-కళ్యాణదుర్గం స్వర్ణలత
98486 26114

అందం వెనక...

● సౌందర్యానికి సంబంధించిన ప్రతి ఉత్పత్తిలో రసాయనాలు కలిసే ఉంటాయి.

● మన ఇళ్లల్లో అందానికి సంబంధించిన ఉత్పత్తులు ఎన్నో ఉంటాయి. చర్మం, శిరోజాలు, గోళ్లు ... ఇలా ఎన్నో సౌందర్య సాధనాలు వాడుతుంటాం.

● కొన్ని ఫెయిర్‌నెస్ క్రీముల్లో పాదరసం కలిసి ఉంటుంది. దానివల్ల కిడ్నీలు, నాడీ వ్యవస్థ దెబ్బ తినే ప్రమాదముంది.



తెలుసా

● లిప్‌స్టిక్ వాడటం పెరిగిపోయింది ఈ రోజుల్లో. ఇందులో వుండే రసాయనాల వల్ల కిడ్నీ సమస్యలు, క్యాన్సర్లకు దారి తీయవచ్చు.

● చిన్నారులకు వాడే షాంపులూ, ఇతరత్రా ఉత్పత్తులన్నింటిలో 'డయాక్సిన్' అనే రసాయనాన్ని కలుపుతున్నట్లు ఎన్.టి.పి (ద నేషనల్ టాక్సికాలజీ ప్రోగ్రామ్) గుర్తించింది. దీనివల్ల క్యాన్సరు రావచ్చు.

● ప్రతి సౌందర్య సాధన ఉత్పత్తిని మొదటగా పెంపుడు జంతువులైన కోతులు, పిల్లులు, కుక్కలు, కుందేళ్లపైనే ప్రయోగిస్తారు.

● ప్రతి సంవత్సరం 10 కోట్లకు పైగా జంతువులపైన ప్రయోగాలు జరుగుతున్నాయి. కొన్ని వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలతో బాధ పడుతుంటే, మరికొన్ని రసాయనాలను తట్టుకోలేక చనిపోతున్నాయి.

● టూత్‌పేస్ట్, సబ్బులలో సువాసన వచ్చే డిఓరెంట్స్ కలపడం వల్ల శరీరంలోని హార్మోన్లపై చెడు ప్రభావం పడుతుంది. ఆయింట్‌మెంట్లు, బాడీ లోషన్లలో 'ప్యారాబెన్' అనే రసాయనం కలుపుతారు.



● ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సౌందర్య సాధనాల ప్రయోగాలు వికటించి లక్ష జంతువులపైనే చనిపోతున్నాయి.

● మనిషి శరీర నిర్మాణానికి, జంతువుల శరీర నిర్మాణానికి చాలా తేడా ఉంటుంది. జంతువులకు సరిపడిన రసాయనాలన్నీ మనుషులకు హాని తలపెట్టవనడానికి లేదు.

● వాణిజ్యపరమైన సబ్బులలో ఎక్కువగా జంతువుల కొవ్వును కలుపుతారు.

● ముఖం మీద ఉన్న ముడతలు తగ్గిస్తాయని చెప్తూ అనేక రకాల క్రీములను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు. అయితే అవి ముడతలను శాశ్వతంగా దూరం చేయలేవనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

● దాదాపు ప్రతి ఐదిటిలో కనీసం ఒక సౌందర్య ఉత్పత్తిలో 'ఫార్మాల్డిహైడ్' ఉంటుంది. దీనిలో క్యాన్సర్‌కు సంబంధించిన రసాయనాలు ఉంటాయి.

● ఒకవేళ మీరు సౌందర్య సాధనాలు వాడాలనుకుంటే యు.ఎస్.డి.ఎ నేషనల్ ఆర్గానిక్ ప్రోగ్రామ్ ద్వారా గుర్తింపు పొందిన నాణ్యమైన ఉత్పత్తులను ఎంచుకోండి. దాని వల్ల శరీరానికి ఎటువంటి హానీ ఉండదు.

● మనం వాడే బేకింగ్ సోడా, సముద్రపు ఉప్పు, కొబ్బరినూనె లాంటి వాటిలో విషపదార్థం వుండదు. వాటి వల్ల ఆరోగ్యానికి హాని ఉండదు.

● ప్రపంచవ్యాప్తంగా వున్న వ్యాపారులు ఒక సంవత్సరంలో సౌందర్య ఉత్పత్తులను అమ్మి 16000 కోట్ల డాలర్లను సంపాదిస్తున్నారు.

● గర్భవతులు కాన్పు అయ్యేంత వరకు ఎటువంటి సౌందర్య ఉత్పత్తులను వాడకపోవడమే మంచిది. ఎందుకంటే వాటి ప్రభావం పుట్టే బిడ్డ ఆరోగ్యంపై పడుతుంది.

● పళ్లు మెరవడానికి వాడే ఉత్పత్తులు, నెయిల్ పాలీష్‌లు, హెయిర్ స్ప్రేలను ఎక్కువగా వాడుతుంటారు. వీటిలో 'పైథిలేట్స్' ఉంటాయి. వాటి వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కొనాల్సి వస్తుంది.

● వాణిజ్య ప్రకటనల్లో కన్పించే అందమైన మోడళ్లను చూసి మోసపోకూడదు. వారిది సదరు ఉత్పత్తులను వాడడం వల్ల వచ్చిన అందం కాదు. నిజమైన సౌందర్యం. వాస్తవానికి అందాన్ని రెట్టింపు చేసే సౌందర్య సాధనాలు లేవు.

● మనం వాడే నెయిల్‌పాలీష్, షాంపూల వల్ల పర్యావరణం దెబ్బతింటుంది. కారణం వాటిలోని ప్రమాదకర రసాయనాలు మన ఇళ్ల డ్రైనేజీ నుంచి నదులలోకి, సముద్రం లోకి చేరి పర్యావరణ కాలుష్యానికి దారితీస్తోంది.





క థ

ఆఖరి ఘడియలు

- మౌద్గల్యస
9985050134

ఒక మగ, ఆడ.. కష్టసుఖాలు అనుభవిస్తూ..ఒకే కప్పు కింద జీవించి.. ఒకరినొకరు తాకకుండా కనీసం మాటలయినా లేకుండా మనుగడ సాగించడం సాధ్యమయ్యే పనేనా?
సూరిదాస్ ఇంట్లో అడుగుపెట్టిన నలభై ఐదేళ్లకి షోషి కన్నుమూసింది. సూరిదాస్ కన్నబిడ్డ సతియా ఆమె చితికి నిప్పుపెట్టాడు. ఆ సమయంలో ఆమె వంక చూశాడు సూరిదాస్.

ఆ రూపం మసకగా కనిపించింది. అప్పటికే సూరిదాస్ కళ్లకు కేటరాక్ట్ సోకింది. వయసు 59 ఏళ్లకు చేరింది. షోషి ముఖంపై సూర్యకిరణాలు పడి ఆమె దేహాన్ని ప్రకాశవంతం చేశాయి... సతియా తన కర్తవ్యాన్ని నిర్వర్తించే ముందు ఎవరో కావాలని ఆమె ముఖంపై టార్చివేసినట్లుగా. అయితే అంత వెలుతురులోనూ సూరిదాస్‌కి ఆమె రూపం స్పష్టంగా గోచరించలేదు. కేవలం ఇలా ఉండి ఉంటుందన్న ఆలోచన మాత్రం అతని మస్తిష్కంలోకి చేరింది. నలభైఏళ్ల క్రితం ఆమెను దగ్గరగా చూసుంటే ఓ అభిప్రాయం ఏర్పరుచుకోవటానికి వీలయ్యేదేమో.. కానీ.. ఆచారం ప్రకారం సూరిదాస్ ఆమెను నేరుగా చూడాలన్న ఆలోచనను పక్కన పెట్టాడు. ఆమె చనిపోయిన తర్వాత కూడా. దహన కార్యక్రమాలయ్యాక ఇంటికొచ్చాడు. అతన్ని ఒంటరి తనం వేధించింది. ఇంటి ప్రాంగణంలో ఒక్క క్షణమయినా నిలవలేకపోయాడు. అన్నేళ్లు అక్కడ ఆమె పాదాల కదలికలను చూస్తూ గడిపాడు. పోనీ వరండాలో కూర్చుందామనుకున్నా... రోజూ ఆమె తనకు రెండు సార్లు భోజనం వడ్డించే చోటన్న విషయం స్ఫురించింది. అతని మనసు అంగీకరించలేదు. ఇంటి ముందున్న పురాతన మామిడి చెట్టు కింద కూలపడ్డాడు. ఇంతలా బాధపడుతున్నాడు తను? అతనికే ఆశ్చర్యం కలిగింది.

షోషి అక్కడకు వస్తున్నట్టనిపిస్తే చాలు సూరిదాస్ తల తిప్పుకునేవాడు. ఆమె ఇత్తడి గిన్నెలతో రోజూ ఆహారం పట్టుకొస్తూ ఉండేది. గోడవైపునో, కంచె వైపునో చూస్తూ తను మాట్లాడేవాడు. ఆమె దానికి జవాబు చెప్పేది. సాధారణంగా తనకు ఆమెను పిలిచే అవసరమే కనపడేది కాదు. ప్రతి నిముషం తన అవసరాలను గుర్తించే మసలుకునేది. ఏ సమయంలో ఏది అవసరమో అప్పటికప్పుడు తెలుసుకుని అమర్చేది. ఉదయం బెల్లం టీ సిద్ధం చేసి ఉంచేది. దాంతో పాటే నాలుగు కట్టల పొగాకు... ఆ పని పూర్తి చేసుకునేసరికి తోటపనికవసరమైన తోపుడు పార, మామూలు పార, బకెట్లు ఇతర పనిముట్లు అన్నీ ఒక చోట అమర్చి పెట్టేది. తను తోట పనికెళ్లిపోయేవాడు. షోషి కూరలో పోపు వేస్తోందంటే తనకు భోజన సమయం అయినట్లు లెక్క. గబుక్కున వచ్చేసేవాడు. వరండాలో నూనె బాటిల్ సిద్ధంగా ఉండేది. ఒంటికి దట్టంగా నూనె పట్టించుకుని స్నానం ముగించి తను తిరిగి వచ్చేసరికల్లా పూజ ఏర్పాట్లు చేస్తుండేది. నుదుటి నుంచి నాసిక పైభాగం వరకూ అలాగే రెండు భుజాలకు, ఛాతికి నిలువుగా పెద్ద తిలకం అద్దుకుని పద్మాసనంలో కూర్చుని పూజ చేసేవాడు. భగవంతునికి సాష్టాంగ నమస్కారం చేసేసరికల్లా మధ్యాహ్న భోజనం ఎదురు చూస్తుండేది. బుద్ధిమంతుడయిన పిల్లవాడిలా అతను భోజనం పూర్తి చేసేవాడు. పదార్థాల గురించి ఎటువంటి ఫిర్యాదులు ఉండేవికావు. షోషి తన వంట ఎలా ఉందన్న అంశం తెలుసుకునే అవకాశమే ఉండేది కాదు. ఎప్పుడో గానీ పదార్థాన్ని మారు వడ్డించమన్న దాఖలాలూ ఉండేవి కావు. అయితే షోషి అత్యంత జాగ్రత్తగా ఈ వ్యవహారాన్ని నిర్వహించేది. అతను తనతో మాట్లాడే అవకాశం లేకపోవటం దురదృష్టమని ఆమె భావించేది. ఆకలి, కోపం రెండూ సమృద్ధిగా ఉన్నా వాటిని వ్యక్తం చేయకుండా సూరిదాస్ ఎలా మెలిగేవాడో అనేది ఆమెకు అంతుబట్టేది కాదు.

నిత్యం తన మేలిముసుగులో నుంచి సూరిదాస్ కదలికలను గమనించేది. అతనిలో పురుషత్వం కొట్టొచ్చినట్లు కనపడేది. వయసులో మార్పు తప్ప అతని శరీరం బరువెక్కటం గానీ, బలహీనపడటం గానీ జరగలేదని అతన్ని చూస్తే ఆమెకు అనిపించేది. ఒకప్పుడు నిటారుగా నడిచేవాడు. ఇప్పుడు కొద్దిగా వంగి నడుస్తున్నాడు. మోకాళ్ల పైకి లుంగీ ధరించేవాడు.

బయటికెళ్లినపుడు తప్ప భుజాలపైన వస్త్రం ఎప్పుడూ ఉండదు. మార్కెట్‌కెళ్లినప్పుడు మాత్రం తెల్లచొక్కా వేసుకునేవాడు. అతనికున్న చొక్కా అదొక్కటే. మెడలో తులసి మాల, ఎర్ర టవల్ మాత్రం ఎప్పుడూ ఉండేది. మనిషి నల్లవాడయినా దృఢంగా ఉండేవాడు. విశాలమైన నుదురు, పొడవైన నాసిక, పొడవాటి భుజాలు, వెడల్పాటి ఛాతీ, చురుకైన కళ్లు, స్ఫురద్రూపిలా ఉండేవాడు. పొట్ట లోపలకి పోయి ఉండేది. బహుశా కడుపు నిండా తిండి తినేవాడు కాదేమో.. కాళ్లూ చేతులు దృఢంగా ఉండేవి. పేదరికం ప్రభావం అతని శరీరంపై కనిపించేది కాదు. అతనికి పెద్దగా ఆస్తిపాస్తులు లేవు. ఉన్నదల్లా చిన్న స్థలం.. అందులో ఏదో కాస్త పంట.. దానితోపాటు రెండు మూడు మామిడి చెట్లు, మునగ, జామ చెట్లు, ... ఈ పళ్లు కూరగాయలు అమ్మటమే అతనికి జీవనోపాధి.మామిడి పళ్ల సీజన్లో అతను డబ్బులు బాగా సంపాదించేవాడు. ఒకసారి పండు చూస్తే చాలు అదే జాతిదో దాని ధర ఏమిటో ఇట్టే పసిగట్టే వాడు. తన ఇంట్లో ఉన్న మామిడి చెట్టు ఎవరు ఎప్పుడు నాటారో తెలియదుగానీ...దాని రుచి మాత్రం మధురంగా ఉండేది. కాయలు కూడా విరగకాసేవి. కాయగూరలు బానే పండేవి. ఇంటి ఆవరణలో చిన్న కొలను లాంటిది ఉండేది. వాళ్లు స్నానం అక్కడే కానిచ్చేవారు. వేసవిలో ఇది ఎండిపోయేది. ఆ సమయంలో కొలను కొంత లోతుగా గొయ్యి తవ్వేవాడు. అందులో రకరకాల చేపలు చేరేవి. వైష్ణవుడు, పైగా పూర్తి శాకాహారి కావటంతో అతనికి అవేమీ ఉపయోగపడేవి కావు. చుట్టుపక్కల వాళ్లు వాటిని పట్టుకుపోయి వండుకుని తినేవారు.

ఇక పోతే సూరిదాస్‌కు ఇంకో వ్యాపకం ఉండేది. అది హబీలా సరదాగా ప్రారంభమైనా అతనికి అదనపు సంపాదనని తెచ్చిపెట్టి కడుపు నింపేది. పండగలు పబ్బాలప్పుడు అతనికి బియ్యం, కొబ్బరికాయలు, స్వీట్లు, డబ్బులు, తువ్వాలు, బట్టలు బహుమతిగా లభించేవి. అతనికి భక్తిభావాన్ని పెంచే కీర్తనలు పాడటం అంటే విపరీతమైన ఇష్టం. రాత్రి సమయాల్లో వరండాలో కూర్చుని డోలక్ వాయించేవాడు. మొదట ఆ ధ్వని మామూలుగా ఉండేది. రాత్రి ఝాము గడిచే కొద్దీ ఆ వాయిద్యం స్వరం హెచ్చేది. ఈ ప్రపంచంలో అనేక రకాల ఆకలి ఉండేది. రుచుల్లో తీపి, పులుపు, వగరు, కారం, చేదు ఉన్నట్టే .. శరీరం ఆకలి, కడుపు ఆకలి, మనసు ఆకలి, ఆత్మ ఆకలి అనేవి వేర్వేరుగా ఉంటాయి. ఈ ఆకళ్ల సాలెగూట్లో మనిషి చిక్కుకుని విలవిలలాడతాడు.

సూరిదాస్ డోలక్ వాయిద్యం అతని మనసులో గూడుకట్టుకున్న వేదనని తగ్గించేదని ఆమె అనుకునేది. రెండు రకాల ఆకళ్లకు సూరిదాస్ గుర్తించాడు. కడుపు ఆకలిని భోజనం తీర్చేది. ఆత్మ ఆకలిని అతని కీర్తనలు చల్లార్చేవి. ఈ రెండూ కాకుండా ఇతర ఆకళ్లను అతను పట్టించుకున్న దాఖలాలు లేవు. శరీరం, మనసు రెండు ఆకళ్లను ఆత్మ ఆకలితోనే నింపుకునేవాడేమో..

ఇక షోషి ఆకలిని తన మేలిముసుగు వెనక భద్రంగా దాచుకునేది. ఆమె రెండు పాదాలు, చేతులు మాత్రమే సూరిదాస్ కంటపడేవి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆమె ఏదో పనిలో నిమగ్నమై నిత్యం అటూ ఇటూ తిరుగుతుండేది. ఇల్లు శుభ్రం చేయటం, గిన్నెలు తోమటం, ఇతరత్రా వంట పనులతో పాటు పిడకలు చేసేది. ఆమె పాదాల కింద నలిగే పేడలో శరీరం, మనసు ఆకలి తీరిపోయేది. సూరిదాస్ భజనలు, కీర్తనల్లో ఆమె ఆత్మ ఆకలి సరిపోయేదేమో.. ఎవరికీ అర్థంకాని విషయం ఇది. యవ్వనంలో ఆమె నాజూకుగా అందంగా ఉండేది. వయసు పెరిగాక ఆమెకు ఫైలేరియా సోకింది. పాదాలు మందంగా మచ్చలతో ఉండేవి. అరచేతులు మృదువుగా తమలపాకుల్లానే

ఉంటాయి. అప్పుడప్పుడు భోజనం వడ్డించేటప్పుడు ఆమె పొడవాటి చేతులు, ఎర్రగా మెరుస్తూ అతని కంటపడేవి.

మేలిముసుగులో ఉన్న నాసికకున్న బంగారపు ముక్కెర దృష్టిలో ఉండేది. ఆమెను ముసుగులేకుండా చూసిన వాళ్లెవరూ చుట్టుపక్కల లేరంటే అతిశయోక్తి కాదు. నిజం చెప్పాలంటే సంఘం విధించిన ఆంక్షలను గౌరవిస్తూ ఒకరినొకరు అభిమానించుకుంటూ నియంత్రణలో వారు కాలం గడిపారు. షోషి కంటే రెండేళ్లు చిన్నదయిన ఆమె సోదరి శశి పురిటినొప్పులు పడి పిల్లాడిని ప్రసవించి మరణించకపోయుంటే ఆమె జీవితకాలం పాటు మేలిముసుగులో ఉండే ఆగత్యం ఉండేది కాదు. శశి భర్త సూరిదాస్ పిల్లలు లేని తమ మేనమామ ఇంటికి దత్తతకు వెళ్లాడు. ఆ తర్వాత ఆమె మేనత్త ముగ్గురు మగపిల్లల్ని ప్రసవించటంతో నిరాదరణకు గురికావాల్సి వచ్చింది. కనీసం ఆ ఇంటి ఆస్తిలో వాటా అయినా వస్తుందనుకుంటే ఆ అవకాశమూ అతనికి లభించలేదు. తన సొంత తండ్రి చనిపోయిన తర్వాత అక్కడున్న ఆస్తిపాస్తులన్నింటినీ అతని నలుగురు సోదరులు పంచుకున్నారు. ఆత్మగౌరవం అతని నోరు తెరవనివ్వలేదు.

ఇదే సమయంలో శశి తండ్రి ఇల్లరికం వచ్చే అల్లుని కోసం ఎదురు చూశాడు. అప్పటి ఆమె సోదరి షోషి బాలవితంతువుగా ఉండేది. సూరిదాస్ మామగారింటికి ఇల్లరికం వచ్చేశాడు. భార్య కాన్పు అయ్యేవరకూ అంతా సజావుగా సాగింది. శశి తండ్రి కూడా తన మనవడి ముఖం చూసి ఈలోకాన్ని విడిచాడు. షోషి తప్పనిసరిగా తన సోదరి బిడ్డ సతియాను సాకవలసిన పరిస్థితి ఎదురయ్యింది. ఇక 39 ఏళ్ల సూరిదాస్ ఒక్కడే ఇంటి దగ్గర ఉండిపోయాడు. అతను ఇల్లరికపు అల్లుడు కాకపోయినా, షోషి వదిన గారు కాకపోయినా అతను మరో వివాహం చేసుకునే వీలుండేది.

వయసుపరంగా ఆమె అతని కంటే దాదాపు 11 ఏళ్లు చిన్నది.

వారిద్దరి బంధం పవిత్రమైంది. ఆ ఇద్దరు ఒకరినొకరు చూసుకోవటం గానీ, మాట్లాడుకోవడం గానీ, నిషిద్ధం. సంఘం దాన్ని అనుమతించదు.ఇక సరదాలు, జోక్స్ లాంటి వాటికి ఆస్కారమే లేదు. దీన్ని కాదని ఏమైనా చేసినా అది నరకంలోకి అడుగు పెట్టినట్టేనని భావించేవారు.

చెల్లెలు మరణించగానే, పక్కింటావిడ చేత షోషి కబురు పంపింది. సూరిదాస్ కావాలనుకుంటే మారు మనువు చేసుకోవచ్చు. వేరే ఇల్లు చూసుకోవచ్చని. ఆ వయసులో మగవాడు ఒంటరిగా జీవించటాన్ని సంఘం అంతగా ఒప్పుకోదు. అందుకే ఆమె సలహా ఇచ్చింది. పిల్లవాడి బాధ్యత ఒక పెద్దమ్మలా చూసుకోటానికి ఆమె సిద్ధమయ్యింది. సూరిదాస్‌కు మేనమామ అస్తులపైన ఆసక్తిలేదు. "నా బిడ్డ బాగోగులు చూసుకుంటే చాలు. శశి జ్ఞాపకాలతో తను మరో పెళ్లి చేసుకోలేడు. అందుకే ఈ ఇంట్లో రెండో పెళ్లికి అవకాశమే లేదు" అని మనసులో మాట చెప్పేశాడు. ఆ సాయంత్రం అటక మీద నుంచి డోలక్ తీశాడు. దాన్ని తనతోపాటు అత్తగారింటికి తెచ్చుకున్నాడు. ఎన్నో రోజులుగా దాన్ని వాడలేదు.

ఇప్పుడు అదే తనకు అత్యంత అవసరమయిన వస్తువుగా తోచింది. అర్థరాత్రి వరకు దాన్ని వాయిస్తూ గడిపాడు. సతియాకు తగినంత తల్లి ప్రేమను అందించింది షోషి. అయితే సతియాకు తల్లి ప్రేమ రుచి తెలియదు. అందుకే షోషి ప్రేమ విలువను అంతగా గుర్తించలేకపోయాడు. పెద్దమ్మ పట్ల అంతగా గౌరవాన్ని ప్రదర్శించేవాడు కాదు.

ఇక తండ్రీ కొడుకులిద్దరికి అంతగా పొసికేది కాదు. తల్లిని మింగేశాడని సూరిదాస్ కొడుకుని నిందిస్తే.. భార్యను పొట్టన పెట్టుకున్న

వాడని అతను తండ్రిని తూర్పారపట్టేవాడు. సూరిదాస్ స్కూలు పక్కనే మకాం ఉండేవాడు. తన కొడుకు బాగా చదువుకుని మెట్రిక్యులేషన్ పాసయితే గ్రామంలో చదువుకున్నవాడిగా గుర్తింపు పొందుతాడు. ఏదయినా ప్రభుత్వోద్యోగంలో చేరితే తనలాగా కూరగాయలు అమ్ముకోవాల్సిన అగత్యం ఉండదు. భద్రత బావుంటుందని అనుకునేవాడు. అయితే మొదటి నుంచి వాడికి చదువుపైన అంత శ్రద్ధ ఉండేది కాదు. స్కూలు పేరు చెబితేనే అతనిలో విసుగు జనించేది. బడి ఎగ్గొట్టి చెట్లెమ్మట పుట్టలెంబడి తిరిగేవాడు. కోపంతో తండ్రి వాడిని తీసుకొచ్చి గదిలో పడేసి తాళ్లతో కట్టిపడేసేవాడు. బయట తలుపు గడియ పెట్టి స్కూలుకి సరిగా వెళతానని వాడు చెప్పే దాకా పచ్చి మంచి నీళ్లు కూడా ఎవరూ ఇవ్వకండి అని గట్టిగా చెప్పేవాడు. చివరిమాట షోషిని ఉద్దేశించింది. ఆమె అతనికి జవాబు చెప్పేది కాదు. అయితే సూరిదాస్ బయటకు వెళ్లిపోయిన తర్వాత తలుపు తీసి తాళ్లు విప్పి కడుపునిండా తిండి పెట్టేది. బయట నుంచి తిరిగొచ్చిన సూరిదాస్‌కి వరండాలో ఏ పుస్తకమో పట్టుకుని బుద్ధిగా చదువుకుంటున్న సతియా కనిపించేవాడు. పల్లెత్తుమాట కూడా అనకుండా తన పని తాను చేసుకుపోయేవాడు సూరిదాస్. ఇదంతా నెలలో పది, పదిహేను సార్లు సాగేది. ఏదయితేనేం సతియా చదువు సజావుగా సాగలేదు. ఒక్క తరగతి రెండు మూడేళ్ల పాటు చదివాడు. షోషి పెద్దగా బాధ పడేది కాదు. సమర్థులయిన టీచర్లుంటే అల్లరి చిల్లరగా తిరిగే ఇలాంటి పిల్లల్ని సరిచేయాలిగా...వాడు సరిగా చదవకపోవటానికి టీచర్లదే తప్పని నిశ్చయానికొచ్చేసింది. అయితే సూరిదాస్ మాత్రం కొడుకునే తప్పుపట్టేవాడు. వాడు శ్రద్ధ పెడితే చదువు సజావుగా సాగుతుందిగా అనుకునేవాడు. తండ్రిని సంతృప్తిపరచడం ఇష్టం లేని సతియా ఎప్పుడూ దాన్ని పట్టించుకునే వాడు కాదు.

ఓ రోజు 18 ఏళ్ల సతియా ఇల్లు వదిలి పట్నం పారిపోయాడు. అక్కడేదో ఉద్యోగంలో కుదురుకున్నాడు. అంతే ఆ ఇంట్లో సూరిదాస్, షోషి ఇద్దరే మిగిలిపోయారు. ఇప్పుడు వారికి తమ గురించి ఆలోచించుకోవటం తప్ప సతియా గురించి పట్టించుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. ఇద్దరూ తమ మనసులో బాధను గుప్తంగా దాచుకుని కుమిలిపోసాగారు. సాధారణంగా పల్లెల్లో ఉండేవాళ్లకి ప్రత్యేకంగా ఆటవిడుపు ఉండదు. ప్రతి ఇంట్లో విషయాలే అందరూ చర్చించుకుంటూ వుంటారు. అప్పటి వరకూ సూరిదాస్ కుటుంబం గురించి మాట్లాడుకునే వాళ్లు కాస్తా ఎప్పుడయితే కన్నకొడుకు ఇల్లు విడిచి వెళ్లిపోయాడో అప్పటి నుంచి ఆ కుటుంబాన్ని పట్టించుకోవడమే మానేశారు. ఆ ఇల్లు నిశ్శబ్ద ఆలయంగా మారిపోయింది. ఎంతో కష్టమయినా సంఘ గౌరవమర్యాదలకు నిష్టగా కట్టుబడిన ఆ జంటను ఎవరూ గుర్తించి గౌరవించిన పాపాన పోలేదు. అలాగే వాళ్ల జీవితాలు చివరివరకూ సాగిపోయాయి.

షోషి ఫైలేరియా వ్యాధిగ్రస్తురాలయింది. తరచూ కీర్తనలను పాడటం వల్ల సూరిదాస్ ఊపిరితిత్తులకి వ్యాధి సోకింది. ఒకరికొకరు సాయపడే పరిస్థితి లేదు. సూరిదాస్ ఆస్తమా బారినపడినప్పుడల్లా మేలిముసుగు కింద నుంచి చూసి జాలిపడటం తప్ప మరేదీ చేయలేకపోయేది షోషి. షోషి ఫైలేరియా బాధతో విలవిలలాడుతున్నప్పుడు తన వేదనని డోలక్ వాయించటం ద్వారా తెలియజెప్పడం తప్ప సూరిదాస్ చేసేదీ ఏముండేదికాదు.

తల్లి లేని చెల్లెలి బిడ్డను సాకటం తప్పు కాదు కానీ.. ఆమె ఫైలేరియా బారినపడితే వదిన అయినందుకు కాళ్లకు మర్దనా చేయటం తప్పు... ఇదెక్కడ నీతి?

సూరిదాస్ మనసు బాధగా మూలిగేది. అది రోజూ అతని డోలక్ సాధనలో వ్యక్తమయ్యేది.

కాలం గడుస్తున్న కొద్దీ ఒకరి బాధ మరొకరికి వేదనగా మారిపోయింది. అలాగని ఒకరినొకరు ఊరడించుకోవటం గానీ, స్వాంతన పరుచుకోవటం గానీ వీలుకాని పరిస్థితి. ముఖాముఖి ఒకరినొకరు నేరుగా సంభాషించుకోకపోయినా ఇతరుల దగ్గర ముసల్ది, ముసలాడు అని ఒకరినొకరు సంబోధించేవారు. ఆడవాళ్లతో మాట్లాడేటప్పుడు షోషి చెప్పేది. 'పాపం ఆ ముసలాడు ఎంత బాధ పడుతున్నాడో...ఆస్తమా అతన్ని మింగేస్తోంది. పాపం సేవ చేయడానికి ఇంట్లో ఒక్క పురుగయినా లేదు అంటూ జాలిపడేది. యవ్వనమంతా గడిచిపోయింది. పిల్లాడి కోసం ఎంత తాపత్రయ పడ్డాడో.. ఇప్పుడు ఆ కొడుకు, కోడలు ఎక్కడ ఉన్నారో.. ఏం చేస్తున్నారో. నేనున్నన్ని రోజులూ ఫరవాలేదు. ఏదో కాస్త ఉడకేసి పడేస్తాను. ఆ తర్వాత అతన్ని పట్టించుకునేవారెవరో.." అంటూ వాపోయేది. అతని రక్త సంబంధం ఆ బిడ్డ.. వాడు దూరమై అతను పడుతున్న బాధ నేను అర్థం చేసుకోగలను. అంటూ సహానుభూతి చెందేది. అలాగే మగవాళ్ల మధ్య సూరిదాస్ కూడా ఆమె ప్రస్తావన చేసేవాడు. "ఫైలేరియా ఆమెను ఇబ్బంది పెడుతోంది. ఒక్క గ్లాసుడు మంచి నీళ్లు కూడా అందించేవారు లేరు. తల్లి కంటే ఎక్కువగా ఆమె వాడిని సాకింది. ఆ వెధవ ఆమెను పట్టించుకోకుండా పోయాడు. కనీసం ఆమె ప్రాణం పోయినప్పుడు వచ్చి ఆ చివరి కార్యక్రమం అయినా నిర్వర్తిస్తాడో లేదో.. బహుశా అదే ఆమె చివరి కోరిక అయివుంటుంది" అనేవాడు.

షోషి నేరుగా ఇదంతా చెప్పకపోయినా సూరిదాస్ ఆమె మనసు గ్రహించాడు. చాలా మంది అనుకుంటారు. కేవలం నోటి ద్వారా సంభాషణ సాగించవచ్చుని. ఇది మూర్ఖుల అభిప్రాయం.. చేతులు, కాళ్లూ కూడా మాట్లాడగలవు. అవతల వారి పట్ల మనకున్న అభిప్రాయాన్ని ..అది ఇష్టమయినా.. అయిష్టమయినా.. వ్యక్తం చేయగలవు. అన్నం వడ్డించేటప్పుడు విసుక్కుంటూ పెడుతున్నామా, ప్రేమతో పెడుతున్నామా అనేది ఇతరులకు అర్థమవుతుంది. అలాగే డోలక్ వాయిద్యం కూడా. డోలక్ సంతోషంతో వాయిస్తున్నాడా విషాదం గూడుకట్టుకుని ఉందా అనేది సులువుగా తెలుసుకోవచ్చు. సంతోషం, విచారం, దు:ఖం, ఆకలి, ప్రేమ, ఆందోళన, అవగాహన తదితర భావనలను 45 ఏళ్ల సహవాసంలో ఏనాడూ వారు పంచుకున్నది లేదు. ఒకరినొకరు ఊరడించుకుని తమ కష్టాలను కలబోసుకుని బాధను, ఆవేదనను తగ్గించుకున్నదీ లేదు. పూల సుగంధం గాలిలో ఎలా వృథా అవుతుందో..వర్షం నీళ్లు భూమిలో ఎలా ఇంకిపోతాయో, డోలక్ ధ్వని పరిసరాలను ఎలా వ్యాపిస్తుందో..రెండు హృదయాల మధ్య యాదృచ్ఛికంగా బంధం ఏర్పడుతుంది. ఇదే అవతల వారిని అర్థం చేసుకునే వీలు కల్పిస్తుంది.

'మీ పెద్దమ్మ మంచం మీద ఉంది. రేపో మాపో అన్నట్టుగా ఉంది. ఆమె నాతో నేరుగా చెప్పకపోయినా.. ఈ ప్రపంచాన్ని విడిచేలోపు తను నిన్ను చూడాలని గాఢంగా కోరుకుంటుంది. నువ్వు చితికి నిప్పంటించకపోతే మోక్షం లభించదని గాఢంగా విశ్వసిస్తుంది. భవిష్యత్తులో నువ్వు ఇంకోసారి ఇక్కడకు రాకపోయినా ఫరవాలేదు. ఇప్పుడు మాత్రం ఆమె కోసం నువ్వు రావాలని కోరుకుంటున్నాను. ఇది టెలిగ్రామ్‌గా భావించి తక్షణం బయలుదేరి రాగలవు' ఇదీ ఆ ఉత్తరంలో సారాంశం.

సతియాకు అర్థమైంది. అహన్ని పక్కన పెట్టి సూరిదాస్ ఇదంతా చేశాడని. చివర్లో సంతకంలో కూడా నీ తండ్రి అని వ్యవహరించలేదు. తన పేరే రాసుకున్నాడు. ఇదంతా పరోక్షంగా ఆమె పైన ప్రేమ వ్యక్తం చేయటమే అనిపించింది. తనూ తన వంతు చేయాలనిపించింది.

ఇక అతను ఆగలేదు. భార్యతో సహా బయలుదేరాడు. అది తండ్రిపై గౌరవంతో కాదు. తన పెద్దమ్మ చివరి కోరికను తీర్చాలన్న సంకల్పంతోనే. వచ్చే ముందు బిస్కెట్లు, స్వీట్లు పళ్లు వెంట తెచ్చాడు.

సతియా ఇంటికి వచ్చేసరికి షోషి ఆఖరిఘడియలు సమీపించాయి.

మెల్లగా కళ్లు విప్పి అతని వంక చూసింది. శ్వాస బాగా సాగుతోంది. అతని రాక ఆమెకు ఉల్లాసాన్నిచ్చిందో లేదో తెలియదు. అయితే తన కోసం తహతహలాడుతున్న విషయాన్ని గుర్తించాడు.

తృప్తి కలిగిందేమో.. మరుసటి రోజు తెల్లవారకుండానే ఆమె కన్ను మూసింది.

ఇక అంత్యక్రియల తంతు ముగిసింది. సూరిదాస్ ఇంటికొచ్చి వరండాలో కూలపడ్డాడు. కళ్లు మూసుకొని ఉన్నాడు. అతనేం ఆలోచిస్తున్నాడో తెలీదు. మధ్య మధ్యలో కీర్తనలు ఆలపిస్తున్నాడు. పాటిలో విషాదం తొంగిచూస్తోంది.

కోడలు లోపల్నుంచి అరుస్తోంది. 'అత్తా..మమ్మల్ని విడిచి ఎటు వెళ్లిపోయావు?

ఆచారం ప్రకారం దుష్టశక్తుల్ని తరమటానికి సాధారణంగా అందరూ అనే మాట ఇది.

సతియా పసిపిల్లాడి మాదిరిగా విలవిలలాడిపోయాడు.

'పెద్దమ్మా.. ఓ పెద్దమ్మా' ఆమె ఆత్మకు శాంతి కలగాలన్న తహతహ అతని వేదనలో ప్రతి ఫలించింది. మరో వైపు రాత్రంతా సూరిదాస్ డోలక్ వాయిస్తూనే ఉన్నాడు. అతని చేతివేళ్లు కమిలి రక్తం స్రవించింది..

✦

కొత్త పుస్తకాలు

గుండె గుట్టు తెలుసుకోండి

దేశంలో గత కొన్ని దశాబ్దాల నుంచి గుండె జబ్బుల బారిన పడుతున్నవారి సంఖ్య ఎక్కువగానే ఉంది. " హృదయాన్ని పదిలంగా ఉంచుకుని అద్దంలా చూసుకోవాలని" ఒక సినీకవి చెప్పినట్లు రకరకాల వత్తిళ్లతో హృదయాన్ని నింపేస్తే అదే జబ్బులకు కారణమౌతోంది. గుండె జబ్బుల నివారణకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా మరణాలు కూడా అదేవిధంగా చాలా ఎక్కువ ఉండడం అందరికీ ఆందోళన కలిగిస్తోంది. ఈ దేశంలో గుండె జబ్బులు ఇంత తీవ్ర స్థాయిలో ఉండడానికి కారణాలేమిటి? గుండె జబ్బులకు నివారణా మార్గాలు ఎమైనా ఉన్నాయా? అన్న ప్రజల సందేహాలకు సమాధానంగా డాక్టర్ బండారు రాధాకృష్ణమూర్తి, డాక్టర్ బండారు సులోచనలు రాసిన పుస్తకమే "గుండె జబ్బు, కారణాలు - నివారణలు. చూడడానికి ఈ పుస్తకం కాస్త చిన్నదిగా కన్పించినా అందరికీ అవసరమైన సమాచారం ఇందులో ఉంది. వైద్య రంగానికి చెందిన పుస్తకమే అయినా సాధారణ పాఠకులను దృష్టిలో పెట్టుకుని ఎంతో సరళంగా, సహజమైన



గుండె జబ్బు కారణాలు-నివారణ,
రచన: డా ॥ రాధాకృష్ణమూర్తి, డాక్టర్ బండారు సులోచన,
పేజీలు: 128, ధర: 90రూ/-, ప్రతులకు: నవచేతన, ప్రజాశక్తి, విశాలాంధ్ర, బుక్‌హౌస్.

శైలిలో దీనిని అందించారు. మొత్తం 22 అధ్యాయాలున్న ఈ పుస్తకంలో మొదటిదీ, చివరిదీ మినహాయిస్తే మిగిలినవన్నీ ఎంతో క్లిష్టమైన వైద్య సంబంధ అంశాలను వాటి మూలాల లోతుల్లోకి వెళ్లి తేటతెలుగులో అందించడం అభినందనీయం. రెండో అధ్యాయంలో 'మన శరీరం' అనే శీర్షికతో చాలా అంశాలు వివరించారు. అందులో భాగంగా జీవకణాలు, అవయవ మండలాలు, జీర్ణావయవ మండలం, కాలేయం, మూత్రపిండాలు, ఎడ్రినల్ గ్లాండ్స్ గురించి వివరించారు. తర్వాత అధ్యాయం 'మన ఆహారం'లో పిండి పదార్థాలు, నూనె పదార్థాలు (ఫ్యాట్స్), మాంసకృత్తులు (ప్రొటీన్లు) వంటి వాటిని విశదీకరించారు. గుండెకు జరిగే రక్తప్రసరణ తీరుతెన్నులను, రక్తనాళాల వివరాలను నాలుగో అధ్యాయంలో విశ్లేషించారు. గుండె పోటుకు పక్షవాతానికి ముఖ్య కారణమైన 'ఎథెరొస్క్లెరోసిస్' గురించి సామాన్య పాఠకులకు కూడా అర్థమయ్యే విధంగా ఐదో అధ్యాయంలో వివరించారు. ఇలా మొత్తం అన్ని అధ్యాయాలు దేనికవే చదివిస్తాయి. గుండె పోటు అంటే ఏమిటి? రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలను కూలంకషంగా చర్చించే ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ తమ అవగాహన కోసం దగ్గర ఉంచుకోవాల్సిందే. వైద్య విజ్ఞానాన్ని వివరించిన ఈ పుస్తకంలో చిత్రాల సంఖ్య చాలా స్వల్పంగా ఉండడం పెద్ద లోపమే. ఇదొక్కటి తప్పితే మిగిలిన పుస్తకమంతా పాఠకులకు ఎంతో ఆసక్తికరంగా సాగుతుంది. మలి ముద్రణలోనైనా అవసరమైన చిత్రాలు జత చేస్తే మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

- బెందాళం క్రిష్ణారావు

భగత్‌సింగ్ ఆశయాలకు వక్రీకరణ

సామ్రాజ్యవాదం నశించాలి, స్వతంత్రరాజ్యం రావాలి, భారత ప్రజలు సోషలిస్టు సమాజంలో సుఖశాంతులతో వర్ధిల్లాలి అని ఆశించి, తను ఎంచుకున్న మార్గంలో అసమాన దీక్ష కనబరచిన భరతమాత ముద్దుబిడ్డ భగత్‌సింగ్. పరిచయం అవసరంలేని అసమాన ధీరుడు. ఆయన జీవితంపై తెలుగులో ఇప్పటికే చాలా పుస్తకాలు వచ్చాయి. అయినా ఇప్పుడు ఆంధ్రభూమి దినపత్రిక సంపాదకులు ఎంవిఆర్ శాస్త్రి గారు మరోసారి ఆ పనికి పూనుకున్నారు. ఒక రచయిత తన అభిప్రాయాలు చొప్పించి వాటిని సమర్థించే ప్రయత్నం చేయక, జరిగిన నిజానిజాలను పాఠకుల ముందు ఉంచి వారిని ఆలోచింపజేయడం ఉత్తమమైన రచనా పద్ధతి. కాని ఈ"భగత్ సింగ్" పుస్తకాన్ని దానికి భిన్నమైన పంథాలో రాశారు. భగత్‌సింగ్ త్యాగాలను ఆకాశానికెత్తుతూనే ఆయన ఆశయాలను పాతాళానికి పూడ్చిపెట్టే ప్రయత్నం చేశారు. చెయ్యి తిరిగిన రచయిత కనుక ప్రతిభావంతంగా భగత్‌సింగ్ జీవిత విశేషాలను వివరిస్తూనే ప్రాణార్పణ కారణాలను తుడిచేసేందుకు పూనుకున్నారు. భారతదేశ స్వతంత్ర పోరాటంలో పాలు పంచుకోవడానికి నిర్మొహమాటంగా నిరాకరించిన వారు, ఈనాడు తమను తాము దేశభక్తులుగా ప్రచారం చేసుకుంటున్నారు. అంతే

భగత్‌సింగ్
రచయిత :- ఎం.వి.ఆర్.శాస్త్రి (ఆంధ్రభూమి సంపాదకులు)
వెల :- రు. 200
ప్రచురణ :- దుర్గా పబ్లికేషన్స్, హైదరాబాద్

కాకుండా వీళ్ళే ఎవరి దేశభక్తి ఎంతో నిర్ణయించే సర్టిఫికేట్లు ఇస్తున్నారు. దీని వెనుక కుట్ర దాగి ఉంది. అసమానతలపై నిర్మించిన హిందూత్వ మనువాదం తనను ప్రతిఘటించిన శక్తులని తనలో విలీనం చేసుకుంటూ ముందుకు వెళ్ళాలని ప్రయత్నం చేస్తుంది. లొంగని అభ్యుదయ శక్తులని విధ్వంసం చేసి పురోగమించడం మనువాద సిద్ధాంత వ్యూహం. ఇప్పుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ భావజాలాన్ని, భగత్‌సింగ్ ఆశయాలను కూడా విధ్వంసం చేయపూనుకున్నది. అందులో భాగమే ఈ రచన. ఈ రచయిత గతంలో భారతదేశ చరిత్ర, కాశ్మీర్ సమస్య విషయాలలో కూడా ఇదే పద్ధతిలో రచనలు చేసిన విషయం మనకు తెలుసు.తెలుగులో భగత్‌సింగ్ సహచరులు శివవర్మ, యశ్‌పాల్ రచనలు అందుబాటులో ఉన్నాయి. తెలకపల్లి రవి సంకలనం చేసిన డాక్యుమెంట్లూ ఉన్నాయి. వాటికి మించిన విషయాలు ఇందులో లేవు. పైగా అనేక విషయాలలో వక్రీకరణలు, వంకర వాదనలు చోటు చేసుకున్నాయి. సోవియట్ అక్టోబరు విప్లవ శతవార్షిక సంవత్సరంలో మనం ఉన్నాం. 1917 రష్యా అక్టోబర్ విప్లవ అరుణకిరణాలు ప్రపంచమంతటా ప్రసరించాయి. ఆ విప్లవ ప్రభావం భారతదేశంపై కూడా పడింది. భగత్‌సింగ్ మార్క్స్ సిద్ధాంతాలకు, లెనిన్ వాటిని ఆచరణలో పెట్టి సాధించిన విప్లవ విజయాల వల్ల బాగా ప్రభావితుడయ్యాడు. వారి మార్గంలోనే పయనించి దేశానికి వెలుగుల్ని ప్రసాదించాలని కలలు కన్నాడు. పుర్తి స్థాయి కమ్యూనిస్టుగా, నాస్తికుడిగా మారాడు. చిన్న చిన్న ప్రతీకార తీవ్రవాద దాడుల వల్ల పెద్ద ఉపయోగం లేదని నిశ్చయానికి వచ్చిన భగత్, దేశాన్ని విప్లవ మార్గం వైపు సంఘటితం చేయడం ఎలా అని ఆలోచించాడు. అందుకే భగత్‌సింగ్ అనుచరులందరూ కమ్యూనిస్టులుగా మారి పనిచేసిన విషయం మనం గమనించవచ్చు. అందుకే సారాన్ని వదిలేసి ఎంతసాగదీసినా వాస్తవాలు మరుగున పడవు. పరివార్ శక్తులు దేశంలో నేడు చేస్తున్న అనేక వక్రీకరణల్లో భాగంగా అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ పుస్తకం వాటిలో ఒకటి.

- భవిష్య

పైసా లేకుండా పదహారేళ్లు...

చేతిలో పైసలు లేకపోతే ఎంత కష్టమో. కాలు కదపలేం. చెయ్యి ఆడించలేం. నిద్ర లేచింది మొదలు మనం చేసే ప్రతి పనీ డబ్బుతోనే ముడిపడి ఉంది మరి. అలాంటిది చేతిలో చిల్లిగవ్వ లేకుండా ఒకరోజు కాదు, సంవత్సరం కాదు, ఏకంగా 16 ఏళ్లు గడిపి, ఎందరినో ఆశ్చర్యపరచింది 69 యేళ్ల హైద్మరీ స్వెర్మర్. అందుకు ఆమె అనుసరించిన పద్ధతులు, కనబరచిన పట్టుదల చూసి ఎవరైనా అచ్చెరువొందాల్సిందే.

ప్రష్యాకు చెందిన పెద్ద వ్యాపారవేత్త కూతురు హైడ్మరీ. ఆయన కాఫీ వ్యాపారంలో బాగా సంపాదించాడు. చిన్నప్పుడు ఈమెను, పెరటి తోటను చూసుకోడానికి జీతానికి ఇంట్లోనే ఆయా ఉండేది. అలా వారి జీవితం ఆనందంగా ఉన్న సమయంలో 1939లో రెండవ ప్రపంచ యుద్ధం తలుపు తట్టింది.

అంతే ఒక్క సారిగా ఊహించని కష్టం. పరిస్థితులన్నీ తారుమారయ్యాయి. ధనవంతులుగా ఉన్న వీరు నిరుపేదలుగా మారారు. కట్టు బట్టలతో ప్రాణాలు కాపాడుకోటానికి బలవంతంగా జర్మనీకి పారిపోయారు. అక్కడ ఎన్నో సంవత్సరాలు కష్టపడి పొగాకు సంస్థను స్థాపించాడు హైడ్మరీ తండ్రి. అది బాగా అభివృద్ధి కావడంతో మళ్లీ మంచి రోజులు వచ్చాయి.

'లివింగ్ వితౌట్ మనీ' అనే డాక్యుమెంటరీ రూపొందించి....డబ్బు లేకుండా జీవితాన్ని ఎలా గడపొచ్చో వివరించింది హైడ్మరీ స్వెర్మర్. ఆమె తన అనుభవాలను తనే స్వయంగా ప్రజల వద్దకు చేర్చాలనుకుంది. 'స్టార్ మనీ ఎక్స్‌పెరిమెంట్స్', 'సీయింగ్ మిరాకిల్ ఇన్ లైఫ్ వితౌట్ మనీ' అనే పుస్తకాల ద్వారా తన అనుభవాలను ప్రపంచం ముందు పరిచింది.

ఇంతలోనే వ్యాపారంలో నష్టం వచ్చింది. ఆ తర్వాత లాభాలు. ఇలా జీవితంలో వచ్చిన ఒడిదొడుకులతో విసిగిపోయిన హైడ్మరీ ఎంతో మానసిక ఘర్షణకు లోనైంది.

ఒక్క సూట్‌కేసుతోనే...

అలాంటి హైడ్మరీ వయస్సు ఇప్పుడు 69 సంవత్సరాలు. ఉపాధ్యాయురాలిగా, సైకోథెరపిస్ట్‌గా పని చేస్తూ కొంత డబ్బు సంపాదించుకుంది. కానీ కష్టపడి సంపాదించిన డబ్బు కంటే బాల్యంలో జరిగిన బతుకు పోరాటాలపైనే ఆమె ఆలోచనలు సాగేవి. చివరికి ఒక నిర్ణయానికి వచ్చింది. అసలు డబ్బు లేకుండా జీవించడానికి నూతన మార్గాలను అన్వేషించడం



ప్రారంభించింది. 1994లో మొదటి మార్పుకు శ్రీకారం చుట్టింది. అప్పటికి హైడ్మరీకి ఇద్దరు పిల్లలు. భర్త నుంచి విడాకులు తీసుకుంది. తను ఒంటరి అయినందున స్నేహితురాలు తన ఇంట్లో ఉండమని అడగడంతో కొద్ది రోజులు గడిపింది. ఆ సమయంలో ఆమెకు ఒక ఆలోచన తట్టింది. సంవత్సరమంతా డబ్బు లేకుండా గడపాలనే నిర్ణయానికొచ్చింది. ఆలస్యం చేయకుండా తనకున్న అపార్ట్‌మెంట్‌తో సహా అన్నీ అమ్మేసింది. అవసరానికి సరిపడా కొన్ని చిన్న చిన్న వస్తువులను సూట్‌కేసులో సర్దుకుంది. అలా కొత్త జీవితంలో అందుకున్న ఆనందాన్ని గుర్తించి ఏకంగా 16 సంవత్సరాలు గడిపింది. మొదట కొన్ని రోజులు పాత స్నేహితుల ఇంట్లో గడిపేది. తను నివసించే అపార్టుమెంట్స్‌లో అందరికీ డబ్బు లేకుండా జీవితాన్ని ఎలా జయించవచ్చో వివరించేది. కొత్తగా వచ్చిన అతి థులకు రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసేది. సమావేశాలకు ఎంతో ఉత్సాహంతో దూర ప్రాంతాల నుండి వచ్చేవారు. క్లాసులకు తను నిర్వహించే సమావేశాలకి ఎటువంటి ఫీజు తీసుకోదు. కేవలం రైలు చార్జీల వరకే తీసుకొనేది. అంతకు మించి ఇస్తే తిరస్కరించేది. మొదట్లో తోట పనులు, ఇంటి పనులు చేస్తూ తను ఉండటానికి సరిపడ డబ్బునే సంపాదించుకొనేది. తినడానికి తిండి కోసం ఒక దుకాణంలో కొన్ని గంటలు పనిచేసేది. వేసుకోడానికి స్నేహితుల దగ్గర బట్టలు తీసుకొనేది. ఉండటానికి గది లేదు. తన చిన్న సూట్‌కేస్‌తో బండి మీద ఇంటి ఇంటికీ తిరుగుతుంది. ఇలా జీవితాన్ని తనకు నచ్చినట్టుగా, డబ్బుతో పనిలేకుండా మలుచుకొని ఎందరినో ఆశ్చర్యపరుస్తోంది.

-కుమారి



రుచి

చేపల కుర్మా



కావాల్సిన పదార్థాలు:

బొచ్చె చేప ముక్కలు-5
అల్లం, వెల్లుల్లి ముద్ద-2స్పూన్లు
ఉల్లిపాయ, టమాటా ముక్కలు-పావుకప్పు
పచ్చిమిర్చి-5
కరివేపాకు రెబ్బలు-కొన్ని
పసుపు-చెంచా
ఉప్పు-రుచికి తగినంత
ధనియాల పొడి-1స్పూను
జీలకర్ర పొడి-1స్పూను
మెంతి పొడి-అర స్పూను
కారం-నాలుగు చెంచాలు
గరం మసాలా పొడి-చెంచా
చింతపండు-నిమ్మకాయంత
కొత్తిమీర తరుగు-కొద్దిగా
నూనె-పావుకప్పు

తయారీ విధానం:

చేపముక్కలకు ఉప్పు, పసుపు, కారం, అరచెంచా వెల్లుల్లి ముద్ద పట్టించి అరగంట నాననివ్వాలి. తర్వాత బాణలిలో కొద్దిగా నూనె వేడిచేసి చేప ముక్కల్ని వేయించాలి. మరో బాణలిలో నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కల్ని వేయించి మిగిలిన అల్లం వెల్లుల్లి ముద్ద, కొంచెం ఉప్పు కారం, ధనియాలపొడి, జీలకర్ర చేర్చాలి. తర్వాత సన్నగా తరిగిన టమాటాముక్కలు వేసి మెత్తబడేదాకా వేయించాలి. దానిలో రెండు కప్పుల నీళ్లు పోసి అవి మరుగుతుండగా కరివేపాకు, గాటుపెట్టిన పచ్చిమిర్చి వేయాలి. అందులో చింతపండు రసం వేయాలి. అవి మరుగుతున్నప్పుడే వేయించి పెట్టుకున్న చేపముక్కల్ని వేసి కొద్దిగా మెంతిపొడి చల్లాలి. ముక్కలు ఉడికిన తర్వాత మసాలాపొడి, కొత్తిమీర చల్లి దింపేస్తే సరిపోతుంది. వేడి వేడి చేపల కూర్మా సిద్ధం.

ఫిష్ ఫ్రై

కావాల్సిన పదార్థాలు:

చందువా చేపముక్కలు-పావుకిలో
మొక్కజొన్న పిండి-టేబుల్ స్పూన్
బియ్యపు పిండి-టీ స్పూను
కోడి గుడ్డు-1
బ్రెడ్‌పొడి-2 కప్పులు
నూనె-తగినంత
ఉప్పు-తగినంత
మిరియాల పొడి-అర టీ స్పూను

తయారీ విధానం:

ముందుగా చేప ముక్కల్ని కడిగి పక్కన పెట్టుకోవాలి. ఒక గిన్నెలో కోడిగుడ్డు మిశ్రమాన్ని గిలకొట్టి ఉంచుకోవాలి. తర్వాత ఇంకొక పాత్రలో మొక్కజొన్న పిండి, బియ్యప్పిండి, కోడిగుడ్డు మిశ్రమం, ఉప్పు, మిరియాల పొడి వేసి అవసరమైతే కొద్దిగా నీళ్లు పోసి బాగా కలపాలి. ఆ మిశ్రమాన్ని చేప ముక్కలకు పట్టించాలి. తర్వాత చేప ముక్కల్ని బ్రెడ్‌పొడిలో అద్ది పక్కన పెట్టుకోవాలి. బాణలిలో నూనె వేడి చేసి తక్కువ మంట మీద చేప ముక్కల్ని వేయించి తీసి సాస్‌తో సర్వే చేయండి.

చేపల పులుసు

కావాల్సిన పదార్థాలు:

చేపలు-కిలో
టమోటాలు-4
ఉల్లిపాయలు-3
అల్లం వెల్లుల్లి ముద్ద-2 స్పూన్‌లు
గరం మసాలా-స్పూను
జీలకర్ర-స్పూను
ధనియాలు-2 స్పూన్లు
కరివేపాకు-రెండు రెబ్బలు
చింతపండు-30 గ్రాములు
కొత్తిమీర-ఒక కట్ట
పచ్చి మిరపకాయలు-2
కారం-2 స్పూన్లు
పసుపు-చిటికెడు
ఉప్పు-తగినంత
నూనె-సరిపడా

తయారీ విధానం:

ముందుగా చేపల్ని శుభ్రం చేసి నచ్చిన సైజులో ముక్కలుగా కట్ చేసి పక్కన పెట్టుకోవాలి. ఒక పెద్ద గ్లాసు నీళ్లలో చింతపండుని నానబెట్టుకోవాలి. మిక్సీలో ఉల్లిపాయ ముక్కలు, ధనియాలు, జీలకర్ర, అల్లం వెల్లుల్లి ముద్ద వేసి మెత్తగా రుబ్బుకోవాలి. స్టౌపై బాణలిలో నూనె కాచి అందులో కరివేపాకు, పచ్చి మిరపకాయ ముక్కలు, ఉల్లిపాయ ముద్ద వేసి వేగించాలి. బాగా వేగిన తర్వాత ఉప్పు, పసుపు, కారం, గరం మసాలా వేసి కలపాలి. తర్వాత అందులో చేప ముక్కల్ని కూడా వేసి కాసేపు మగ్గనివ్వాలి. మధ్య మధ్యలో చేప ముక్కల్ని తిప్పుతూ ఉండాలి. నానబెట్టిన చింతపండు నుంచి పులుసును సిద్ధం చేసుకోవాలి. చేప ముక్కలు కొంచెం వేగాక అందులో చింతపండు పులుసు వేసి బాగా ఉడకనివ్వాలి. పావు గంట సేపు సన్నని మంటపై పులుసు మరిగిన తర్వాత కొత్తిమీర తురుము వేసి దించేయాలి.

బాల నేస్తాలు

పదాలు పూరించండి

ఇక్కడ కొన్ని పక్షులు,జంతువుల బొమ్మలనుంచాం. అయితే వాటి ఇంగ్లీష్ పేర్లలో ఒకటి రెండు అక్షరాలు మిస్సయ్యాయి. ఆ అక్షరాలని కలిపేస్తే పదం పూర్తవుతుంది. బొమ్మల ఆధారంగా మిస్సయిన అక్షరాలని గుర్తించి ఖాళీల్లో నింపేయండ



lizard, cat, giraffee, fish, dog, gorilla, whale, bear, crocodile, monkey, wolf, elephant, kiwi, kangaroo, snake, parrot

దారి కనిపెట్టండి

మంచు కొండల్లో ఐస్ స్కేటింగ్ చేస్తున్న ఇద్దరు మిత్రులు కలుసుకునే దారిని కనిపెట్టండి..



నీడతో బొమ్మ

పిల్లలూ మీకు బొమ్మలంటే భలే ఇష్టం కదూ! చేతి వేళ్లతో బాతు బొమ్మ ఎలా చేయచ్చో ఇక్కడ చూసి, చీకటి గదిలో చిన్న వెలుగులో మీరూ ప్రయత్నించండి.



చుక్కలు కలిపేద్దాం



బుజ్జి స్టార్

జ: శ్రద్ధాకపూర్

హాయ్ ఫ్రెండ్స్! నేనొక బాలీవుడ్ స్టార్‌ని. ఇది నా చిన్ననాటి ఫోటో. ఇంతకీ నేనెవరో గుర్తించండి?



కనిపెట్టండి

ఇక్కడ కనిపిస్తున్న వ్యక్తి ముఖంలో కొన్ని జంతువులు, పక్షు లుదాగున్నాయి. అవెక్కడున్నాయొ గుర్తించి సున్నా చుట్టేయండి.

టాస్మానియన్ డెవిల్

పిల్లలూ! మీరు టాస్మానియన్ డెవిల్ పేరెప్పుడైనా విన్నారా...'లూనీ ట్యూన్స్', 'మెర్రీ మెలోడీస్'లో కార్టూన్ క్యారెక్టర్ 'టాజ్' గుర్తిందికదా అచ్చం అలానే ఉంటుంది ఈ జంతువు.

- వీటి ముఖ భాగం ఎలుకని పోలి ఉంటుంది. కంగారూల్లా వీటి ఉదర భాగంలో సంచి ఉంటుంది.
- పదునైన దంతాలు, నలుపు లేదా గోధుమరంగు బొచ్చుతో, పొట్టిగా ఉండే ఈ జంతువుల్లో పోరాట శైలి మాత్రం అధికంగా ఉంటుంది.
- ఆస్ట్రేలియా ఖండంలో దాదాపు 90,758 చ.కి విస్తీర్ణంలో ఉన్న టాస్మానియా ద్వీపంలో మొట్టమొదట వీటిని కనుగొనడంతో వీటికి టాస్మానియన్ డెవిల్ అనే పేరు స్థిరపడింది.
- ఇవి 51-79సెం.మీ పొడవు, 4-12కి బరువుంటాయి.
- ఎలాంటి వాతావరణ పరిస్థితులకైనా తట్టుకొని జీవించగల టాస్మానియన్‌లు తీరప్రాంతాలు, అడవుల్లో ఉండటాన్ని ఇష్టపడుతుంటాయి.
- ఇవి రాళ్ల కింద, బొరియలు కొండ గుహల్లో మాత్రమే నిద్రిస్తాయి.
- పగలంతా నిద్రించే ఈ జంతువు రాత్రి వేళలో ఆహారం కోసం పదహారు కి.మి ప్రయాణిస్తుంటాయి.

- ప్రపంచంలో అతిపెద్ద మాంసాహార జంతువుగా గుర్తించ బడ్డ టాస్మానియన్ డెవిల్ పక్షులు, చేపలు, పాములు, కీటకాలను ఆహారంగా తీసుకుంటాయి.
- జంతువులు, పక్షుల మృతదేహాల్లో ఎముకలు, కండరాలు, జుట్టు ఇలా ఏ ఒక్క భాగాన్నీ విడిచి పెట్టకుండా పూర్తిగా తినేస్తాయి.
- ప్రమాద సమయాల్లో ఇతర జంతువుల నుండి కాపాడుకునేందుకు దవడ భాగాన్ని ఎక్కువగా తెరిచి పెద్ద శబ్దాలు చేస్తుంటాయి.
- టాస్మానియన్ డెవిల్ పిల్లల్ని ఇంప్స్ అంటారు
- మూడు వారాల గర్భధారణ కలిగి ఎక్కువగా ఏప్రియల్ కాలంలో దాదాపు 50 పిల్లలకు జన్మనిస్తాయి.
- కంగారు పిల్లల మాదిరిగా తల్లి ఉదరభాగంలో నాలుగు నెలలు ఉండే ఇంప్స్ బయటకు రాగానే తల్లి వీపు భాగంపై చేరతాయి.
- పోషకాహార లోపంతో పాటు ముఖ కణితిలో ఏర్పడే క్యాన్సర్(డెవిల్ ఫేషియల్ ట్యూమర్ డిసీజ్ (డిఎఫ్‌టిడి)) కారణంగా ప్రతిసంవత్సరం అధిక సంఖ్యలో డెవిల్స్ మృతి చెందుతుండటంతో ప్రస్తుతం ఇవి అంతరించిపోతున్న జంతుజాతిగా గుర్తించబడ్డాయి.
- సేవ్ ది టాస్మానియన్ డెవిల్ ప్రోగ్రామ్ ద్వారా ప్రస్తుతం టాస్మానియా, ఆస్ట్రేలియా ప్రభుత్వాలు వీటిని కాపాడేందుకు కృషి చేస్తున్నాయి..

పదవికాసం - 45

కూర్పు: రావెళ్ల

1		2	✿	3		4		5
	✿		✿		✿		✿	
6		✿	7			✿	8	
	✿	9	✿		✿	10	✿	✿
11				✿	12			13
✿	✿		✿	14	✿		✿	
15		✿	16			✿	17	
	✿	18	✿		✿	19	✿	
20					✿	21		

ఆధారాలు

అడ్డం

1. పసి పిల్లలు బోర్లాపడి దేకడం (3)
3. తీవ్రతరం చేయు (5)
6. తల (2)
7. నునుపు కాదు (3)
8. దశావతారాలంటే ఎన్ని అవతారాలు (2)
11. లెక్కలు రాసేవాడు అటు నుండి (4)
12. ద్రాక్షలత (4)
15. నవనీతం (2)
16. గడ్డిపోచ (3)
17. గది (2)
20. అడవిలో విహరిస్తే (5)
21. ద్రోణాచార్యుని భార్య (3)

నిలువు

1. పాపం చేసే స్వభావం కలవాడు (5)
2. తిరగబడ్డ పాశం (2)
3. మన్మథుడు (4)
4. వన్నె (2)
5. తెలుగు సంవత్సరాది (3)
9. ఒక తెలుగు సంవత్సరం 'తా'తో మొదలు. గజిబిజిగా (3)
10. గ్రహాలలో మొదటిది (3)
13. యుద్ధ రంగం (5)
14. తగవు తీర్చడం (4)
15. వరద (3)
18. కవిత రాసేవాడు (2)
19. శివుని భార్య శీర్షాసనం వేసింది (2)

సుడోకు

6			7	2			3	1
	3	5	1	6	9	8		
9				8				
	5	6		9				
		1					7	
3	4		5			2		
		8	6		3	7	5	
	7			5				3
							8	

గతవారం జవాబులు

8	1	6	5	2	7	9	3	4
9	7	3	6	8	4	1	2	5
2	4	5	9	1	3	6	8	7
7	5	2	3	4	9	8	6	1
3	6	8	7	5	1	2	4	9
1	9	4	2	6	8	7	5	3
4	2	1	8	7	5	3	9	6
5	8	9	1	3	6	4	7	2
6	3	7	4	9	2	5	1	8

1 ఊ	ది	2 పం	3 దు	✿	4 కా	5 తా	ళం	6 చ
ర	✿	7 పా	పా	రా	యు	దు	✿	ర
8 బా	9 ని	✿	కా	✿	పు	✿	10 చూ	చ
11 వి	శా	ఖ	✿	12 వ	✿	13 త్రి	పు	ర
✿	ఖ	✿	14 త	ల	పు	✿	డు	✿
15 వ	రు	డు	✿	పు	✿	16 డి	నీ	17 లు
18 న	దు	✿	19 జై	✿	20 అ	✿	21 లు	బా
మా	✿	22 దే	శా	ధి	నే	23 త	✿	సు
24 లి	ము	త	ఖి	✿	25 గ	రం	తు	చ





ఓ ఆశ కథ

మీరు కొన్ని నెలల క్రితం ఈ చిత్రం చూశారు. అప్పుడు గుండె కలుక్కుమన్న బాధను మరచిపోండి. వాడు బానే ఉన్నాడు. వాడికి 'హోప్' అని పేరు పెట్టిన.. కన్నతల్లికి మించిన.. అమ్మ అంజా ఒడిలో హాయిగా సేద తీరుతున్నాడు. ఆమె ఆశలు (హోప్స్)కు తగ్గట్టు బొద్దుగా నిండుగా తయారయ్యాడు. కావాలంటే కింది చిత్రం చూడండి. ఎంత బాగున్నాడో కదా. వీరి కథ తెలిసిన ప్రతి గుండె స్పందించింది. తమను ఎక్కువగా ప్రభావితం చేసిన, స్ఫూర్తి రగిలించిన, ప్రేరణనిచ్చిన వ్యక్తి మనసుకు హత్తుకున్నారు. జర్మన్ ప్రఖ్యాత మీడియా 'ఫ్రూమ్' పత్రిక నిర్వహించిన ఆన్‌లైన్ పోల్‌లో దలైలామా, ఒబామా, పోప్ ఫ్రాన్సిస్‌లను కాదని అంజా రింగ్రెన్ లోవెన్‌ను 'ది మోస్ట్ ఇన్‌స్పైరింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్'గా మనసుకు హత్తుకున్నారు. నైజీరియా ఇతర ఆఫ్రికా దేశాల్లో కొన్ని చోట్ల 'విచ్ చిల్డ్రన్' అని వీధుల్లో తారస పడుతుంటారు. ఈ పసి పిల్లలంతా కూడా సమాజం నుంచి వెలివేయబడినవారు. దెయ్యం పిల్లల్లా ముద్రపడిన వీరిని ఎవరూ అంటుకోరు. గుక్క పెట్టి ఏడ్చినపుడు కనీసం గొంతు తడిపే అవకాశమే లేదు. ఇలా వదిలేసేది కన్నవారే. అలా ఒంటరిగా విడిచిపెట్టేదీ బిడ్డలు చావడానికే. వాడు గట్టోడైతే ఓ నెల లేకుంటే ఓ రోజు. పుట్టగానో లేదా పుట్టిన రెండు మూడేళ్లకో... బిడ్డకు ఏదైనా సుస్తీ చేసినా, వాడు మిగతా పిల్లల కన్నా భిన్నంగా ఉన్నా చూపించేది వైద్యుడికి కాదు.. భూత వైద్యుడికో, ఎవడో మత పెద్దకో, మంత్రగాడికో. వీళ్లల్లో ఎవడైనా పిల్లల్ని పట్టుకుని పిచ్చి పిచ్చి చేష్టలు చేసి పూనకం వచ్చినట్లు ఊగిపోతూ విచ్ చైల్డ్ అన్నాడో ఇక పిల్లాడి గతి ఆ క్షణం నుంచే చావుకు పోతుంది. వెంటనే తల్లిదండ్రులు వాణ్ని వీధుల్లోకి తీసుకెళ్లి వదిలేస్తారు. ఇరుగు-పొరుగు వారే కాదు ఈ తంతు గురించి తెలిసిన వారెవరైనా పట్టించుకోకూడదు. లేకుంటే వారి బిడ్డలకు కూడా ఇదే శిక్ష, మత మూర్ఖుల దాడుల్ని ఎదుర్కోవాలి. ఇలా రోడ్డున పడి ఒళ్లంతా పుండ్లతోపాటు తిండి, నీరు లేక ఎముకల గూడుగా మిగిలిన హోప్‌ను అంజా రక్షించింది. చుట్టూ మూగిన వారి మూర్ఖత్వం చెంప చెళ్లుమనిపించేలా వాణ్ణి దగ్గరకు తీసుకుంది. ఓ జన్యుపరమైన చర్మ వ్యాధితో బాధ పడుతున్న వాణ్ణి ఎత్తుకుని తాను నడుపుతున్న స్వచ్ఛంద కేంద్రానికి తీసుకెళ్లింది. వాడి వ్యాధికి వైద్యం చేయించి, పౌష్టికాహారాన్ని అందించి ఇదిగో ఇలా తయారు చేసింది. తన సొంత బిడ్డలకు తమ్ముడిగా దత్తు తీసుకుంది. ఈ డేనిష్ అమ్మ ఇప్పుడు పూర్తిగా 'విచ్ చిల్డ్రన్'ను కాపాడేందుకే తన జీవితాన్ని అంకితం చేసింది.









మిఠాయి మినియేచర్

ఐస్ క్రీమ్‌పై చల్లే చాక్లెట్ పొడికి క్రేన్ వస్తుంది. జెల్లీ క్రష్ అయితే రెస్క్యూ బోట్ వేస్తారు. స్ట్రాబెర్రీకి చాక్లెట్ అద్దాలంటే నిచ్చెనేస్తారు. కాసేపు మిఠాయిల రంగుల రాట్నం తిప్పుతారు. మరికాసేపు బిస్కెట్లకు డ్రిల్లింగ్ మొదలెడతారు. ఇటలీకి చెందిన వంటకారుడు మాట్టియో స్టుచ్చి వంట గదిలో. అదంత విశాలంగా ఉండదు. అక్కడంత పెద్ద పేస్ట్రీల్ని చేయరు. కానీ మాట్టియో సృజనే చాలా విశాలంగా, వినూత్నంగా, వైవిధ్యంగా ఉంటుంది. అందుకే అతడి చేతి వంట కమ్మగానే కాక కొత్తగాను అనిపిస్తుంది. మామూలు బిస్కెట్లు, కేకులు, మిఠాయిలతో నిజ జీవిత దృశ్యాల్ని పాకం పట్టేస్తాడు మాట్టియో. మిఠాయిల్ని మినియేచర్ బొమ్మలతో జత చేసి రూపొందించిన కొన్ని ఘట్టాలు చూసి ఆనందించండి. దాని కన్నా పక్కనున్న మిఠాయి ఇంకా ఊరిస్తే లొట్టలేసుకుని సంతృప్తి పడండి.



Check List

Book Number	KNSR02B149	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	No		
Prepared By	Mouni	Cutting By	Mounika
Scanned By	Shameera	Pages	29